
ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

5 విశాఖపట్నం

జిల్లా వార్తలు

సోమవారం 19 ఫిబ్రవరి 2024






తూర్పు నియోజకవర్గం శంఖారావం సభలో ప్రతిజ్ఞ చేస్తున్న నారా లోకేశ్, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, ఇతర నేతలు



పశ్చిమ నియోజకవర్గం శంఖారావం సభకు హాజరైన అశేష జనవాహిని



జాబ్ కేపిటల్‌గా విశాఖ

- టీడీపీ, జనసేన కార్యకర్తల నడుమ చిచ్చుకు కుట్ర
- అప్రమత్తంగా ఉండాలి
- 'హలో ఏపీ, బైబై వైసీపీ' అందరి నినాదం కావాలి

శంఖారావం సభలో ప్రజలకు లోకేశ్ అభివాదం

శంఖారావం సభలో తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్

విశాఖపట్నం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి):

'విశాఖ నగరాన్ని హైదరాబాద్ కంటే రెట్టింపు అభివృద్ధి చేస్తాం. ఐటీ రంగానికి కేంద్ర బిందువుగా చేసి, పెద్ద సంఖ్యలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాం'... అని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పేర్కొన్నారు. ఆదివారం దక్షిణ నియోజకవర్గ పరిధిలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో నిర్వహించిన శంఖారావం సభలో ఆయన మాట్లాడుతూ విశాఖను మళ్లీ జాబ్ క్యాపిటల్ ఆఫ్ ఏపీగా తీర్చిదిద్దుతామని స్పష్టంచేశారు.

మత్స్యకారులు, స్వర్ణకారుల సమస్యలపై దృష్టి..

అధికారంలోకి వచ్చిన వెంటనే మత్స్యకారులు, స్వర్ణకారులు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టిసారించి పరిష్కరించేందుకు కృషిచేస్తామని లోకేశ్ హామీ ఇచ్చారు. స్వర్ణకారులకు ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటుచేస్తామని, వారికి ఆర్థికంగా సహకారాన్ని అందిస్తామన్నారు. మత్స్యకారులకు సబ్సిడీపై రుణాలు అందించడమే కాకుండా వలలు, ఇతర వస్తువులను అందిస్తామన్నారు. విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్‌ను ఆధునికీకరిస్తామని, ఈ ప్రాంత ప్రజలకు ఇబ్బందిగా మారిన డంపింగ్ యార్డును తరలిస్తామన్నారు. గతంలో అంతర్జాతీయ మ్యాచ్ లకు అతిథ్యమిచ్చిన స్టేడియం నిరుపయోగంగా మారిందని, అధికారంలోకి వచ్చిన వెంటనే దీనిని ఆధునికీకరించే బాధ్యతను తీసుకుంటానని లోకేశ్ హామీ

... మిగతా 6వ పేజీలో

ఐటీ రంగానికి కేంద్ర బిందువుగా మారుస్తాం

- పెద్దసంఖ్యలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాం
- హైదరాబాద్‌కు దీటుగా నగరాన్ని అభివృద్ధి చేస్తాం
- స్వర్ణకారుల కోసం కార్పొరేషన్ ఏర్పాటు
- మత్స్యకారుల సమస్యలు పరిష్కారానికి కృషి
- ఫిషింగ్ హార్బర్, ఇందిరా ప్రియదర్శిని స్టేడియాన్ని ఆధునికీకరిస్తాం



ప్రసంగిస్తున్న నారా లోకేశ్

ఐరన్‌లెగ్ జగన్

విశాఖ పరిపాలనా రాజధాని అన్నాడు... 30 ఏళ్ల నుంచి ఉన్న ఎల్‌జీ పాలిమర్స్ పేలింది

- ఆయన్ను నగరానికి ఎంత దూరంలో ఉంచితే అంత మంచిది
- నగరంలో టీడీఆర్‌ల పేరుతో రూ.వేల కోట్లు మింగిన వైసీపీ నేతలు
- దసపల్లా భూములూ కొట్టేశారు
- అధికారంలోకి వచ్చిన తరువాత వడ్డీతో సహా కక్కిస్తాం
- ఏయూ వీసీ అక్రమాలపై విచారణ చేపట్టి జైలులో పెట్టిస్తాం
- ఎన్నికల సమయంలో వైసీపీ అభ్యర్థులు ఓటుకు రూ.10 వేలు ఇస్తారు
- అవి తీసుకుని టీడీపీ, జనసేన అభ్యర్థులకు ఓటు వేయండి
- 'పశ్చిమ' సభలో నారా లోకేశ్

విశాఖపట్నం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి):

'ముఖ్యమంత్రి జగన్ ఐరన్ లెగ్. విశాఖను పరిపాలనా రాజధాని చేస్తానంటూ ఇక్కడ అడుగుపెట్టాడు. 30 ఏళ్లుగా ఉన్న ఎల్‌జీ పాలిమర్స్ పరిశ్రమ పేలిపోయింది. ఏడాదికో పరిశ్రమలో బాయిలర్లు 'పేలుతున్నాయి'..అంటూ తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ విమర్శించారు. ఆదివారం రాత్రి పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని గోపాలపట్నం పెట్రోల్ బంకు సమీపాన నిర్వహించిన 'శంఖారావం' సభలో ఆయన మాట్లాడారు. భస్మాసురుడులాంటి జగన్‌ను విశాఖకు ఎంత దూరం పెడితే అంత

... మిగతా 6వ పేజీలో



దక్షిణ నియోజకవర్గంలో మత్స్యకారులు బహూకరించిన వలతో లోకేశ్. చిత్రంలో టీడీపీ ఇన్‌చార్జి గండి బాబ్జీ, జనసేన నాయకులు ఉన్నారు.

పాలనా రాజధాని పేరు చెప్పి భూముల దోపిడీ

జగన్‌పై లోకేశ్ ధ్వజం

విశాఖపట్నం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి):

పరిపాలనా రాజధాని పేరు చెప్పి విశాఖలో జగన్, వైసీపీ నాయకులు వేల కోట్ల రూపాయల విలువైన భూములు దోచుకున్నారని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఆరోపించారు. 'శంఖారావం' యాత్రలో భాగంగా ఆదివారం ఉదయం విశాఖ తూర్పు నియోజకవర్గ పరిధిలోని అప్పుఘర్ వద్ద ఏర్పాటుచేసిన సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. రుషికొండకు గుండు కొట్టి ఏకంగా రూ.500 కోట్లతో ప్యాలెస్ కట్టుకున్నారన్నారు. ఒక వ్యక్తి కోసం వందల కోట్ల రూపాయలు ఖర్చు చేశారని, ఆయన వచ్చాడా అంటే...అది లేదని అన్నారు. టీడీపీ హయాంలో అదానీ డేటా సెంటర్ ఏర్పాటుకోసం ఒప్పందం కుదుర్చుకుంటే...ఎన్నికల అనంతరం జగన్ రాగానే రద్దు చేశారన్నారు. మళ్లీ తరువాత ఒప్పందం చేసుకున్నారన్నారు. తాము మొదట కుదుర్చుకున్న ఎంవోయూ మేరకు సెంటర్ ఏర్పాటైతే లక్ష మందికి ఉపాధి దొరికేదన్నారు. అలాగే తమ హయాంలో ఫ్రాంక్లిన్ టెంపుల్టన్‌ను తీసుకువస్తే కోడిగుడ్డు మంత్రి పంపించి వేశారన్నారు.

నగరానికి జన సేనాని





జనసేన సమన్వయకర్తలు, నాయకులతో సమావేశమైన పవన్‌కల్యాణ్

- కొణతాల నివాసానికి వెళ్లి భేటీ
- అనంతరం హోటల్‌లో సమన్వయకర్తలతో సమావేశం
- నేడు పూర్తిస్థాయి సమీక్ష

జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ ఆదివారం రాత్రి విశాఖపట్నం విచ్చేశారు. హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో రాత్రి 7.30 గంటలకు నగరానికి చేరుకున్న ఆయనకు విమానాశ్రయంలో పార్టీ నేతలు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. ఆయన విమానాశ్రయం నుంచి నేరుగా మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ ఇంటికి వెళ్లారు. అక్కడ నుంచి నోవాటెల్ హోటల్‌కు చేరుకు న్నారు. నియోజకవర్గాల సమన్వయకర్తలు, ఉమ్మడి విశాఖ జిల్లాలోని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులతో కొద్దిసేపు పవన్‌కళ్యాణ్ సమావేశం అయ్యారు. సోమవారం పూర్తి స్థాయి సమీక్ష నిర్వహించనున్నారు. ఎన్నికల్లో పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలపై వారితో చర్చించి దిశానిర్దేశం చేయనున్నారు. - విశాఖపట్నం/ఆంధ్రజ్యోతి

సాగరతీరంలో సందడి

- నేటి నుంచి 27వ తేదీ వరకూ 'మిలాన్'
- పూర్తయిన ఏర్పాట్లు



హెలికాప్టర్ల చక్కర్లు

విశాఖపట్నం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి):

నగరంలో సోమవారం నుంచి ప్రారంభం కానున్న 'మల్టీ నేషనల్ నేవల్ ఎక్సర్‌సైజస్-2024 (మిలాన్-2024)'కు ఏర్పాట్లు పూర్తయ్యాయి. భారతదేశంతో స్నేహపూరితంగా ఉండే దేశాలను రెండేళ్లకు ఒకసారి ఆహ్వానించి 'మిలాన్' పేరుతో భారీ కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇది 1995లో మొదలైంది. తొలి మిలాన్‌కు ఇండోనేషియా, సింగపూర్, థాయ్‌ల్యాండ్, శ్రీలంక దేశాలు మాత్రమే హాజరయ్యాయి. అప్పటి నుంచి క్రమం తప్పకుండా రెండేళ్లకొకసారి దీనిని అండమాన్‌లో నిర్వహిస్తున్నారు. 2014లో అత్యధికంగా 17 దేశాలు పాల్గొన్నాయి. ఆ తరువాత మిలాన్ పట్ల అనేక దేశాలు ఆసక్తి చూపడం, అండమాన్‌లో అందుకు సరిపడా మౌలిక వసతులు లేకపోవడంతో విశాఖపట్నం వేదికగా 2020లో నిర్వహించాలని నిర్ణయించారు. కరోనా కారణంగా దానిని వాయిదా వేసి, 2022లో ఫిబ్రవరి 25 నుంచి మార్చి 4వ తేదీ వరకు నిర్వహించారు. ఇప్పుడు మళ్లీ 2024లో నిర్వహిస్తున్నారు. పరస్పరం అవగాహన పెంచుకోవడం, ఒకరికొకరు సహకరించుకోవడం, అంతర్గత శక్తులను బలోపేతం చేసుకోవాలనేది ఇందులో పాల్గొనే దేశాల ప్రధాన ఉద్దేశం. మిలాన్‌ను ఈ నెల 27వ తేదీ వరకూ రెండు దశల్లో నిర్వహిస్తారు. మొదటిది హార్బర్ ఫేజ్. ఇందులో అన్ని దేశాల నౌకా దళాలు కలసి ఆర్‌కే బీచ్‌లో ఇంటర్‌నేషనల్ సిటీ పెరేడ్ నిర్వహిస్తాయి. రెండో దశ (సీ ఫేజ్)లో వివిధ దేశాల నేవీ దళాలు సముద్రంలో, గగనతలంలో విన్యాసాలు ప్రదర్శిస్తాయి. సబ్‌మెరైన్లపై పోరాటం, ఆకాశంలో లక్ష్యాలను ఛేదించడం వంటివి ఉంటాయి.



మంత్రి ఇంటి ముందు బైఠాయించిన ఎన్ఎస్‌యూఐ ప్రతినిధులు

మంత్రి ఇంటి ముట్టడికి యువజన కాంగ్రెస్ యత్నం

- 'దగా డీఎస్సీ వద్దు-మెగా డీఎస్సీ' ముద్దు అంటూ నినాదాలు
- ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

'దగా డీఎస్సీ వద్దు-మెగా డీఎస్సీ' ముద్దు అనే నినాదంతో యువజన కాంగ్రెస్ కారకర్తలు, ఎన్ఎస్‌యూఐ ప్రతినిధులు ఆదివారం మిందిలోని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఇంటిని ముట్టడించేందుకు యత్నించారు. - వార్త మెయిన్ 3లో

మ్యూజియం మరమ్మతుల్లో మహా మాయ

- దాదాపు రూ.1.4 కోట్లతో పనులు
- ఏ పని కూడా రూ.ఐదు లక్షలు దాటకుండా ఇంజనీర్లు వ్యూహం
- ఒక్కో పని అనేక ముక్కలుగా విభజన
- అన్నీ నామినేషన్ పద్ధతిలోనే అప్పగింత
- పరిపాలనా ఆమోదం లేకుండానే కొన్ని పనులు చేసినట్టు ఆరోపణలు
- జీవీఎంసీ పాలకులపై తీవ్రస్థాయిలో విమర్శలు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

జీవీఎంసీ అధికారులు తీసుకుంటున్న కొన్ని నిర్ణయాలు విమర్శలకు తావిస్తున్నాయి. గత ఏడాది జీ-20 సదస్సు కోసం నిబంధనలకు విరుద్ధంగా



బీచ్‌రోడ్డులోని విశాఖ మ్యూజియం

పనులు చేపట్టడంపై అనేక ఆరోపణలు వెల్లువెత్తాయి. తాజాగా బీచ్‌రోడ్డులోని విశాఖ మ్యూజియం మరమ్మతుల విషయంలో కూడా అదేవిధంగా వ్యవహరించారు. దాదాపు రూ.1.4 కోట్లు వెచ్చించి కొన్ని పనులు చేసినట్టు చెబుతున్న అధికారులు, వాటన్నింటినీ నామినేషన్ పద్ధతిలో కేటాయించడం అనుమానాలకు దారితీస్తోంది.

జీవీఎంసీ పరిధిలో ఏటా సుమారు రూ.వెయ్యి కోట్లకుపైగా విలువైన అభివృద్ధి పనులు జరుగుతుంటాయి. ఆయా పనులు చేపట్టాలంటే ముందుగా ఎవరో ఒక రు...అధికారులకు విజ్ఞాపన పత్రం అందజేయాలి. దానిని ఉన్నతాధికారులు పరిశీలించిన తర్వాత సహేతుకమైనదని భావిస్తే, కమిషనర్, మేయర్ దృష్టిలో పెట్టి ప్రతిపాదనలు తయారుచేస్తారు. ప్రతిపాదనలు ఆమోదం పొందినట్టయితే ఆ పని పూర్తిచేయడానికి ఎంత ఖర్చవుతుందనే దానిపై అంచనాలు తయారుచేస్తారు. వీటి ఆధారంగా ఇంజనీరింగ్ అధికారులు టెండర్లు పిలిచి, నిబంధనల ప్రకారం అర్హత పొందిన కాంట్రాక్టర్‌తో ఒప్పందం చేసుకుని పని అప్పగిస్తారు. ఒకవేళ రూ.ఐదు లక్షలు కంటే తక్కువ విలువైన పని అయితే మాత్రం టెండరు పిలవకుండానే నామినేషన్‌పై గుర్తింపు పొందిన కాంట్రాక్టర్‌కు అప్పగించే వెసులుబాటు ఉంటుంది. జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులు/పాలకవర్గం

... మిగతా 6వ పేజీలో

అవినీతికి కేరాఫ్ ఎమ్మెల్యే వాసుపల్లి



ఇందిరా మునిసిపల్ స్టేడియంలో జరిగిన శంఖారావం సభలో మాట్లాడుతున్న నారా లోకేశ్


సభలో ప్రతిజ్ఞ చేస్తున్న పార్టీ శ్రేణులు, అభిమానులు, మహిళా కార్యకర్తలు


శంఖారావం సభలో మాట్లాడుతున్న గండి బాబ్జీ

- దక్షిణ టీడీపీ ఇన్‌చార్జి గండి బాబ్జీ
- శంఖారావం సభ సూపర్ సక్సెస్
- పార్టీ శ్రేణుల్లో ఫుల్ జోష్

పూర్ణామార్కెట్, ఫిబ్రవరి 18: విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వాసుపల్లి గణేశ్‌కుమార్ అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీ ధ్వజమెత్తారు. ఇందిరా మునిసిపల్ స్టేడియంలో ఆదివారం జరిగిన టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేశ్ శంఖరావం సభలో ఆయన మాట్లాడారు. వైసీపీ నేతలకు విద్యాలయాల్లో మద్యం సీసాలను పంపిణీ చేసి వాసుపల్లి నియోజవర్గానికే మాయని మచ్చ తెచ్చారన్నారు. టీడీపీ నుంచి పోటీచేశారని ప్రజలు గెలిపిస్తే తన కాలేజీలు, భూముల రక్షణ కోసం వైపీపీ పంచన చేరారని ఆరోపించారు. నియోజకవర్గంలో కాలుష్యం ప్రధాన సమస్యగా ఉందని, అధికారంలోకి వస్తే ఈ సమస్యను పరిష్కరిం చేలా చూడాలని లోకేశ్‌ను కోరారు. రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచినా వన్‌టౌన్ ప్రజానీకం ఎదుర్కొంటున్న కాలుష్యం సమస్య పరిష్కరించడంలో విఫలమయ్యారన్నారు. నియోజకవర్గ పరిధిలోని ఏవార్డులో చూసినా సమస్యలు రాజ్యమేలుతున్నాయన్నారు. తాగునీరు అందడం లేదని, గోతులదారులతో ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. టీడీపీ హయాంలో పంపిణీ చేసిన గృహాలను తన అనుచరులతో కలిసి లబ్ధిదారుల జాబితాలను తారుమారు చేసి అమ్ముకున్న ఘనత వాసుపల్లిదేనన్నారు. వైసీపీ పథకాల్లోనూ ఎమ్మెల్యే దోపిడీ ఆగలేదన్నారు. ఫిషింగ్ హార్బర్ ప్రమాదంలో 40 బోట్లు కాలిపోతే పార్టీ తరఫున బాధితులకు రూ.60 లక్షలు నష్ట పరిహారం అందించామన్నారు. బోట్లలో పనిచేసే కార్మికులకు పది వేలు చొప్పున ఇస్తామని చెప్పిన ప్రభుత్వం.. ఇప్పటికీ చెల్లించలేదన్నారు. విశాఖకు ఎంతో చరిత్ర ఉందని, అంతే చరిత్ర వన్‌టౌన్ ప్రాంతానికి ఉందన్నారు. ఈ నియోజకవర్గంలో ఎంతో మంది ప్రజలు టిడ్కో ఇళ్లకు డబ్బులు కట్టారని, ఇప్పటికీ వారికి ఇళ్లు ఇవ్వలేదన్నారు. సమావేశానికి వస్తే పథకాలు నిలిపివేస్తామని బెదిరించినా భయపడకుండా హాజరైన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో టీడీపీ, జనసేన ప్రభుత్వం దక్షిణ నియోజవర్గం అభివృద్ధికి చిత్తశుద్ధితో, అవినీతి రహితంగా పనిచేస్తుందని హామీ ఇచ్చారు.

అనంతరం జనసేన దక్షిణ ఇన్‌చార్జి ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ టీడీపీ జనసేన మైత్రీ బంధాన్ని విచ్ఛిన్నం చేసేందుకు సజ్జల భార్గవరెడ్డి సోషల్ మీడియా ద్వారా కుట్రలు పన్నుతున్నారన్నారు. దక్షిణంలో వైసీపీ అడ్రస్ గల్లంతవుతుందన్నారు. ఎమ్మెల్యే వాసుపల్లి నియోజవర్గాన్ని అవినీతిమయం చేశారని దుయ్యబట్టారు. వైసీపీ కార్యకర్తలు, ఎమ్మెల్యే అనుచరగణం దోపిడీకి అడ్డులేకుండా పోతోందన్నారు. సభకు తెలుగుదేశం, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు, మహిళలు భారీ సంఖ్యలో హాజరయ్యారు.

టీడీపీ శ్రేణుల్లో ఫుల్ జోష్..

జగదాంబ కూడలి: టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేశ్ ఆదివారం నిర్వహించిన శంఖారావం సభ భారీగా సక్సెస్ కావడం పార్టీశ్రేణుల్లో జోష్ నింపింది. ఇందిరా మునిసిపల్ స్టేడియంలో జరిగిన సభకు పలు వార్డులకు చెందిన నాయకులు, కార్యకర్తలు ఊరేగింపుగా సభాస్థలికి తరలివచ్చారు. జగదాంబ జంక్షన్ నుంచి పాతపోస్టాఫీసు వెలంపేట, పూర్ణామార్కెట్, ఏవీఎన్, జాలరిపేట, రెల్లివీధి పరిసరాలు మధ్యాహ్నం నుంచి టీడీపీ జెండాలతో నిండిపోయాయి. సభలో యువత, మహిళలు అధికసంఖ్యలో కనిపించారు. లోకేశ్‌తో కరచాలనం చేసేందుకు, సెల్ఫీలు తీసుకునేందుకు పార్టీశ్రేణులతో పాటు మహిళలు పోటీ పడ్డారు. మధ్యాహ్నం రెండు గంటలకే స్టేడియం జనంతో నిండి పోయింది. దీంతో నియోజకవర్గ టీడీపీ నేతల్లో జోష్ కనిపించింది.

ముస్లింలకు అండగా టీడీపీ: లోకేశ్

- జ్ఞాపికను బహూకరించిన మైనారిటీ నేతలు

మహారాణిపేట: రాష్ట్రంలో ముస్లిం మైనారిటీలకు టీడీపీ అండగా నిలుస్తోందని, భవిష్యత్తులో వారికి మరింత ప్రాధాన్యం కల్పిస్తామని టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేశ్ ప్రకటించారు. శంఖారావం కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన లోకేశ్‌ను నగరంలోని పలువురు ముస్లిం మైనారిటీ నాయకులు కలిసి జ్ఞాపికను అందజేశారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ నజీర్ ఆధ్వర్యంలో లోకేశ్‌ను కలిశారు. జిల్లాలో ముస్లింలు అంతా తెలుగుదేశం పార్టీ విజయానికి కృషిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గండి బాబ్జీ, అబ్దుల్ చినరెహమాన్, జఫ్రుల్లా, బొట్టా పరదేశియాదవ్, తదితరులు పాల్గొన్నారు.


నారా లోకేశ్‌కు జ్ఞాపికను బహూకరిస్తున్న ముస్లిం మైనారిటీ నాయకులు, చిత్రంలో పార్టీ కార్యదర్శి నజీర్

జాబ్ కేపిటల్‌గా విశాఖ

... 5వ పేజీ తరువాయి

ఇచ్చారు. ఓపెన్ డ్రెయిన్లు ఈ ప్రాంతంలో ప్రధాన సమస్యగా ఉన్నాయని, భూగర్భ డ్రెయిన్లుగా మార్చేలా చర్యలు తీసుకుంటామన్నారు.

టీడీపీకి బలమే కార్యకర్తలు

తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే బలమని లోకేశ్ అన్నారు. ఇక్కడ ఎమ్మెల్యే పార్టీ మారినా కార్యకర్తలు అండగా ఉన్నారన్నారు. కష్టపడి పనిచేసే కార్యకర్తలకు భవిష్యత్తులో ఉన్నత స్థానాలను కల్పిస్తానని లోకేశ్ హామీ ఇచ్చారు. రానున్న రెండు నెలలు కష్టపడి పార్టీని అధికారంలోకి తీసుకురావాలని, ఇంటింటికీ వెళ్లి 'సూపర్ సిక్స్' పథకాల గురించి వివరించాలన్నారు.

టీడీపీ, జనసేన కార్యకర్తల మధ్య చిచ్చు పెట్టేందుకు ఐదు రూపాయలు ఇస్తే పోస్టులు పెట్టే కొంతమంది యత్నిస్తున్నారని, వారి విషయంలో అప్రమత్తంగా ఉండాలని నారా లోకేశ్ సూచించారు. టీడీపీ, జనసేన కార్యకర్తల లక్ష్యం ఒక్కటేనని, 'హలో ఏపీ, బైబై వైసీపీ' అని లోకేశ్ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. నాయకులు, కార్యకర్తలపై అక్రమంగా కేసులు పెట్టి వేధించిన అధికారులు, వైసీపీ నాయకులపై అధికారంలోకి వచ్చిన తరువాత చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు. తాను రెడ్ బుక్ పట్టుకుని తిరుగుతుంటే వైసీపీ నాయకులకు భయం పట్టుకుందని, దీనిపై కోర్టుకు వెళుతున్నారని పేర్కొన్నారు. దమ్ము, ధైర్యం ఉంటే తనను అరెస్టు చేయాలని లోకేశ్ అన్నారు.

జీవీఎంసీలో అవినీతి

జీవీఎంసీలో పెద్దఎత్తున అవినీతికి పాల్పడుతున్నారని, ఒక్క రోడ్డు, డ్రైన్ వేయలేదని, పన్నులు మాత్రం వసూలు చేస్తున్నారని విమర్శించారు. పన్నులు కట్టకపోతే పెన్షన్లు కట్ చేస్తున్నారని, ఇటువంటి ప్రభుత్వాన్ని ఎక్కడైనా చూశారా? ...అని లోకేశ్ ప్రశ్నించారు. మత సామరస్యానికి దక్షిణ నియోజకవర్గం మారు పేరని, ఇక్కడ ఒకే కొండపై గుడి, చర్చి, మసీదు ఉంటాయని, విశాఖ సౌత్‌ను ఓల్డ్ సిటీగా పేర్కొంటారని, అటువంటి సిటీలోని ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని లోకేశ్ ఆవేదన వ్యక్తం చేవారు. ఈ ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక ఉందని, అధికారంలోకి వచ్చిన వెంటనే ఇక్కడున్న నిరుపేదలకు పక్కా ఇళ్లు కట్టించే బాధ్యతను తాను తీసుకుంటానని ఆయన స్పష్టం చేశారు.

తాము గతంలో ఒక పొరపాటు చేశామని, ఇక్కడి ప్రజలు వద్దన్నా రెండుసార్లు ఒక వ్యక్తికి ఎమ్మెల్యే టికెట్ ఇచ్చామని పరోక్షంగా వాసుపల్లి గురించి లోకేశ్ ప్రస్తావించారు. ఆయన వ్యక్తిగత స్వార్థం కోసం పార్టీ మారాడన్నారు. అటువంటి వ్యక్తులకు టీడీపీలోకి ఎంట్రీ లేదని, అటువంటి వ్యక్తికి టికెట్ ఇచ్చినందుకు తమను మన్నించాలని ఈ సందర్భంగా లోకేశ్ కోరారు. జైహింద్ అంటూ నీతీ, నిజాయితీలు కలిగిన వ్యక్తిలా ఇక్కడి ఎమ్మెల్యే మాట్లాడుతుంటాడని, వైసీపీలోకి వెళ్లిన తరువాత చిన్న దొంగగా మారాడని ఆరోపించారు. పేదలకు రావాల్సిన ఉద్యోగాలను డబ్బులకు అమ్ముకుంటున్నాడని విమర్శించారు. ఇప్పుడున్న ఎమ్మెల్యేను చిత్తుచిత్తుగా ఓడించాలని లోకేష్ ప్రజలకు పిలుపునిచ్చారు.

ఐరన్ లెగ్ జగన్

... 5వ పేజీ తరువాయి

మంచిదన్నారు. గతంలో ఎన్నడూ చూడనన్ని ప్రమాదాలను విశాఖ నాలుగున్నరేళ్లలో చూసిందన్నారు. గతంలో చంద్రబాబు నాయుడు విశాఖ వైపు ప్రపంచం చూసేలా అభివృద్ధి చేశారని, జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత నాశనం చేశాడన్నారు. జగన్ అక్రమంగా కట్టిన భవనాలను జప్తు చేసి అమ్మి ప్రజలకు పంచి పెడతామని లోకేశ్ అన్నారు. ఎన్నికల సమయం దగ్గరపడుతున్న తరుణంలో వైసీపీ నాయకులు ఓటుకు పది వేలు ఇస్తామంటారని, అడ్డంగా దోచుకున్న వైసీపీ నాయకులు నుంచి డబ్బులు తీసుకుని టీడీపీ, జనసేన అభ్యర్థులకు ఓటేయలని లోకేశ్ సూచించారు. టీడీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే విద్యార్థుల మెస్ చార్జీలు పెంచుతామని, వసతి గృహాలను ఆధునికీకరిస్తామన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టేందుకు జగన్ సిద్ధపడుతున్నాడని, దీనికి కారణం ప్రైవేటు వ్యక్తులతో కుమ్మక్కు కావడమే నిదర్శనమన్నారు.

ఏయూ వీసీ ప్రసాదరెడ్డి అక్రమాలపై విచారణ

ఏయూ వీసీ ప్రసాదరెడ్డి చేసిన అక్రమాలపై విచారణ జరిపించి డిస్మిస్ చేసి జైలులో పెట్టిస్తామని లోకేశ్ అన్నారు. ప్రసాదరెడ్డి అక్రమాలన్నీ రెడ్‌బుక్‌లో ఉన్నాయన్నారు. టీడీఆర్ బాండ్లలో ఎంపీ విజయసాయిరెడ్డి భారీఎత్తున అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. పెదజాలరిపేట, బిలాల్ కాలనీ, మధురవాడల్లో టీడీఆర్ బాండ్ల పేరుతో వైకాపా నాయకులు రూ.వేల కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. దసపల్లా భూములు కొట్టేశారని ఆరోపిస్తూ..వీటన్నింటిపై ప్రభుత్వం వచ్చిన తరువాత విచారణ జరిపి వడ్డీతో సహా కక్కిస్తామన్నారు. ఎల్‌జీ పాలిమర్స్ స్థానంలో కాలుష్యం లేని పరిశ్రమలు తీసుకువచ్చి స్థానికులకు ఉపాధి కల్పిస్తామని లోకేశ్ ప్రకటించారు. జింక్ పరిశ్రమ ప్రాంతంలో కూడా కొత్త పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. తమ హయాంలో ఎన్‌ఏడీ ఫ్లై ఓవర్, గోపాలపట్నంలో బీటీ, సీసీ రహదారులతోపాటు ఇండోర్ స్టేడియం నిర్మించామని లోకేశ్ వివరించారు.

నేడు ఉత్తర, గాజువాకలో లోకేశ్ శంఖారావం

విశాఖపట్నం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ సోమవారం విశాఖ ఉత్తర, గాజువాకలో శంఖారావం సభలలో పాల్గొంటారు. ఉదయం పదిగంటలకు విశాఖ ఉత్తర బిర్లాజంక్షన్ దరి మైదానంలో శంఖారావం సభకు హాజరవుతారు. పార్టీకేడర్‌తో సమావేశం, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు, జనసేన ఇన్‌చార్జి పసుపులేటి ఉషాకిరణ్, విశాఖ పార్లమెంటు అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎం.శ్రీభరత్‌లు ప్రసంగిస్తారు. అనంతరం లోకేశ్ మాట్లాడతారు. తరువాత పాత గాజువాక లంకా మైదానంలో శంఖారావం సభకు హాజరవుతారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి మూడు గంటల వరకు సభ నిర్వహిస్తారు. గాజువాక సభ ముగిసిన తరువాత అనకాపల్లి, చోడవరం సభలలో పాల్గొంటారు.

మ్యూజియం మరమ్మతుల్లో మహా మాయ

... 5వ పేజీ తరువాయి

పెద్దలు సరిగ్గా దీనినే తమకు అవకాశంగా మార్చుకున్నారు. మిలాన్ నేపథ్యంలో బీచ్‌రోడ్డులోని విశాఖ మ్యూజియం గోడలకు పుట్టీలు, రంగులు వేయడంతోపాటు పీఓపీ సీలింగ్ పనులు, నడకదారులకు రంగులు, ఇత్తడి నేమ్‌బోర్డు ఏర్పాటు, మరుగుదొడ్ల మరమ్మతులు పేరుతో సుమారు రూ.1.4 కోట్ల విలువైన పనులను ప్రతిపాదించారు. అన్ని పనులను కలిపి ఒకే టెండరు పిలవడమో లేదంటే పెయింటింగ్‌లు, సివిల్ వర్కులను నాలుగైదు పనులుగా విభజించి టెండర్లు పిలవడమో చేయాలి. కానీ అలా చేస్తే రూ.ఐదు లక్షల కంటే ఎక్కువ అయిపోతుంది కాబట్టి, టెండరు పిలవాల్సి వస్తుందని అధికారులు భావించారు. అలాకాకుండా రూ.ఐదు లక్షలలోపు ఉండేలా ఒక్కో పనిని ముక్కలుగా విడగొట్టారు. ఆయా పనులను తమకు అస్మదీయులైన కాంట్రాక్టర్లకు అప్పగించేశారు. వాస్తవానికి స్టాండింగ్ కమిటీలో ఆమోదం పొందిన తర్వాతే పనులను కాంట్రాక్టర్‌కు అప్పగించాలి. కానీ మ్యూజియం పనుల విషయంలో అలా జరగకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ముందుగా పనులు ప్రారంభించేసి, తర్వాత ఈ నెల ఏడున జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో కొన్ని అంశాలను ఆమోదించారు. ఈనెల 20న జరిగే స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఆమోదానికి మరికొన్ని అంశాలను ప్రతిపాదించారు. పనులకు పరిపాలనా ఆమోదం లభించకుండానే సోమవారం మ్యూజియాన్ని పునఃప్రారంభిస్తున్నట్టు జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ ప్రకటించారు. పనులు పూర్తి చేసిన తర్వాత స్టాండింగ్ కమిటీ ఆమోదానికి ప్రతిపాదించారా?, లేకపోతే పనులు పూర్తవకుండానే మ్యూజియాన్ని పునఃప్రారంభిచేస్తున్నారా?...అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. టెండర్ల ద్వారా పనులు కేటాయించినట్టయితే కాంట్రాక్టర్ల మధ్య పోటీ పెరిగి తక్కువకు కోట్ చేస్తారని, దీనివల్ల జీవీఎంసీకి చాలావరకూ డబ్బులు మిగులుతాయని కాంట్రాక్టర్లు పేర్కొంటున్నారు. కానీ పాలకవర్గంలోని పెద్దల ఒత్తిడి వల్లనో...అధికారుల ప్రత్యేక ఆసక్తితోనో అస్మదీయులైన కాంట్రాక్టర్లతో పనులు చేయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్ని పనులను అధికారులే బినామీల పేరుతో చేస్తున్నారని కాంట్రాక్టర్లు ఆరోపిస్తున్నారు. గతంలో జీ-20 సదస్సు సందర్భంగా అధికారులు ఇదే మాదిరిగా వ్యవహరించారని, టెండర్లు తెరవకుండానే బినామీల పేరుతో కొన్ని పనులను చేయించేసి, ఆ పనులకు ఇతరులెవరూ బిడ్ వేయకుండా అడ్డుకున్నారని గుర్తుచేస్తున్నారు. మ్యూజియం మరమ్మతుల విషయంలో భారీగా అక్రమాలు జరిగాయని, దీనిపై విజిలెన్స్, ఏసీబీ అధికారులు దృష్టి సారిస్తే వాస్తవాలు బయటపడతాయని పేర్కొంటున్నారు.

మత సామరస్యం శాంతికి పునాది

సీతమ్మధార, ఫిబ్రవరి 18 : మత సామరస్యమే ప్రపంచ శాంతికి పునాదని గా టీవీ ఫౌండేషన్ ఫర్ పీస్ అండ్ హార్మోనీ, ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రిలీజియస్ ఫ్రీడమ్ సంస్థ చైర్మన్ నరవ ప్రకాశరావు అన్నారు. లంకపల్లి బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్ సెమినార్ హాల్లో ఆదివారం ప్రపంచశాంతికి కళలు, సంస్కృతి పాత్ర అంశంపై సదస్సు నిర్వహించారు. ముందుగా ప్రకాశరావు, ఆచార్య జార్జ్ విక్టర్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఐక్యరాజ్య సమితి సూచనల మేరకు ఏటా ఫిబ్రవరిలో మత సామరస్య వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. విక్టర్ మాట్లాడుతూ బాల్య దశలోనే విద్యార్థుల్లో శాంతి సామరస్యంపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో హర గోపాలరావు, హంస్పేస్, చాట్లా బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌బీఎంయూపీ పాఠశాలకు మూడు ఎఫ్‌ఎల్‌ఐపీ ప్యానల్

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 18: జీవీఎంసీ 31వ వార్డు ఆర్‌బీఎంయూపీ పాఠశాలకు మూడు ఎఫ్‌ఎల్‌ఐపీ ప్యానల్ మంజూరయ్యాయని ప్రధానోపాధ్యాయుడు హెచ్.ప్రభాకర్ తెలిపారు. డిజిటల్ తరగతులు జరుగుతున్న నేపథ్యంలో డీఈవోకు విద్యార్థుల సంఖ్యను తెలయజేయడంతో వీటిని మంజూరు చేశారన్నారు. దీనివల్ల మరింత సులభంగా పాఠశాలను బోధించేందుకు అవకాశం కలుగుతుందన్నారు. ఉపాధ్యాయులు ఎన్.కనకరాజు, కె.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆకతాయిల చేష్టలతో విగ్రహానికి నష్టం

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 18: జీవీఎంసీ 31వ వార్డు ఆర్‌బీఎంయూపీ పాఠశాలలోని ప్రధాన ద్వారం వద్ద ఏర్పాటు చేసిన సరస్వతీదేవి విగ్రహం వెనుక అలంకరణ విరిగి పడిపోయింది. ఇది ఆకతాయిల పనేనని పాఠశాల సిబ్బంది చెబుతున్నారు. పాఠశాలకు వ్యాచ్‌మన్ లేకపోవడం కూడా కారణమని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి విగ్రహానికి మెరుగులుదిద్దాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.


సరస్వతీదేవి విగ్రహం వెనుక విరిగిన దిమ్మ

22, 23 తేదీల్లో జాతీయ సదస్సు


సదస్సు బ్రోచర్ విడుదల చేస్తున్న కళాశాల సిబ్బంది

జ్ఞానాపురం, ఫిబ్రవరి 18: స్థానిక సెయింట్ జోసఫ్ మహిళా కళాశాలలో ఈనెల 22, 23 తేదీల్లో వృక్షశాస్త్ర విభాగం, ఐక్యూఏసీ సహకారంతో జాతీయ సదస్సు నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ తెలిపారు. ఈ మేరకు కళాశాలలో ఆదివారం బ్రోచర్‌ను ఆవిష్కరించారు. వృక్షశాస్త్రంలో ఆవిష్కరణలు, అభివృద్ధి చెందుతున్న సాంకేతికత ఈ సదుస్సులో ముఖ్యఅంశం అని ఆమె తెలిపారు.వ్యవసాయం,బయోటెక్నాలజీ,హెర్బల్ టెక్నాలజీ,ఫార్మసీ,బయోడైవర్సిటీ కన్వర్వేషన్ మరియు క్లైమెట్ చేంజ్ రెసిలెన్స్ ఉపశమనాలు,గ్రీన్ టెక్నాలజీస్ వంటి ఆరు ఇతి వృత్తాలతో ఈసదస్సు జరుగుతుందని కన్వీనర్ డాక్టర్ కె.మాణిక్యకుమారి తెలిపారు.ఈకార్యక్రమంలో నిర్వాహక కమిటీ సభ్యులు డాక్టర్ పద్మ సుందరి,సిస్టర్‌హేమ,డాక్టర్ నాగరాజు,డాక్టర్ పికే జయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

మంచి బుద్ధితో మెలగండి: సీఐ


కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ విజయ్‌కుమార్

సీతంపేట, ఫిబ్రవరి 18 : ప్రతి ఒక్కరూ మంచి బుద్ధితో మెలగాలని, చట్ట వ్యతిరేక పనులకు పాల్పడితే చర్యలు తప్పవని నాలుగో పట్టణ సీఐ విజయ్‌కుమార్ హెచ్చరించారు. ఆదివారం ఆయన స్టేషన్ పరిధిలోని రౌడీ సీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఎక్కడ చిన్న గొడవ చేసినా చట్టపరమైన చర్యలతో పాటు జరిమానా విధిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతోనే నాయకత్వ లక్షణాలు


సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు

మహారాణిపేట, ఫిబ్రవరి 18: సమాజానికి సేవ చేయాలని భావించే వారికి అన్ని విషయాలపై కనీస అవగాహన ఉండాలని, అప్పుడే నాయకత్వ లక్షణాలు అలవడతాయని విశాఖ జేసీఐ జోన్ 4 మెంటార్ కేవీ రావు అన్నారు. మహారాణిపేటలో హోటల్ రాక్‌డేల్‌లో ఆదివారం విశాఖ వ్యాలీ జేసీఐ అచీవర్స్ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కారం, నాయకత్వ లక్షణాలు తదితర అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో కేవీ రావు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ అలవరచుకోవాలన్నారు. ప్రజా సమస్యలతో పాటు ఇతర అంశాలపై అవగాహన ఉంటే సమస్యల సత్వర పరిష్కారానికి అవకాశం ఉంటుందని, ప్రతి ఒక్కరికి ఆదర్శంగా నిలుస్తారనిన్నారు. ఈ సందర్భంగా ఇంద్రజా శంకు మాట్లాడుతూ అన్ని రంగాలలో ముందుకు సాగుతున్న మహిళలు సమాజంపై అవగాహన పెంచుకుని, నిర్భయంగా ఎదగాలని అన్నారు. సమావేశంలో దిలీప్‌కుమార్, రామరాజు, తదితరులు పాల్గొన్నారు.

'శంఖారావం సభకు తరలిరండి'

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 18 : బిర్లా జంక్షన్‌లో సోమవారం జరిగే శంఖారావం సభకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని ఆ పార్టీ రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షుడు, రాష్ట్ర కార్యాలయ కోఆర్డినేటర్ తమ్మినేని మోహనరావు పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన ప్రకటన విడుదల చేశారు.

యూసీసీ టీ20 క్రికెట్ చాంపియన్ గెలాక్సీ సీసీ



గెలాక్సీ జట్టుకు ట్రోఫీ అందిస్తున్న గోపీనాథ్‌రెడ్డి

విశాఖపట్నం (స్పోర్ట్సు), ఫిబ్రవరి 18 : వాల్తేరు రైల్వే గ్రౌండ్‌లో జరిగిన 10వ యూసీసీ టీ20 క్రికెట్ టోర్నీలో గెలాక్సీ సీసీ చాంపియన్‌గా నిలిచింది. డిఫెండింగ్ చాంప్ కవలియర్స్ రన్నరప్ స్థానంతో సరిపెట్టుకుంది. ఆదివారం జరిగిన ఫైనల్స్‌లో గెలాక్సీ సీసీ 54 పరుగుల తేడాతో కవిలియర్స్ సీసీపై విజయం సాధించి ట్రోఫీ కైవసం చేసుకుంది. ప్రశాంత్ (43), పాండురంగరాజు (21), పైలా అవినాష్ (33), ధీరజ్ లక్ష్మణ్ (26) రాణించారు. కవలియర్స్ బౌలర్లలో విపిన్ సింగ్ మూడు, భువనేశ్వర్ రెండు వికెట్లు పడగొట్టారు. లక్ష్య ఛేదనలో కవలియర్స్ సీసీ 18.5 ఓవర్లలో 114 పరుగులకు ఆలౌటై ఓటమి చెందింది. పృథ్వీరాజ్ (28) మినహా మిగిలిన వారు వికెట్ల ముందు నిలదొక్కుకోలేకపోయారు. గెలాక్సీ బౌలర్లలో పైలా అవినాష్ మూడు వికెట్లు పడగొట్టగా యశ్వంత్, కమిల్, సందీప్ తలో రెండు వికెట్లు తీశారు. టోర్నీ ముగింపు కార్యక్రమానికి ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) కార్యదర్శి ఎస్ఆర్. గోపీనాథ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విన్నర్స్‌కు ట్రోఫీ, నగదు బహుమతి అందించగా, ఆంధ్ర రంజీ టీం సెలక్షన్ కమిటీ చైర్మన్ ఆర్‌వీసీహెచ్.ప్రసాద్ (కిన్ను) ప్రత్యేక అతిథిగా హాజరై రన్నరప్ జట్టుకు ట్రోఫీ, నగదు బహుమతి అందించారు. ఈ కార్యక్రమంలో యూసీసీ అధ్యక్ష కార్యదర్శులు సీవీఆర్ మూర్తి, వై. వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌కే బీచ్‌లో న్యాయవాదుల నిరసన ప్రదర్శన


ఆర్‌కే బీచ్ వద్ద నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న న్యాయవాదులు

విశాఖపట్నం(లీగల్), ఫిబ్రవరి 18: ఏపీ టైటిల్ యాక్ట్ -22 ను రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ న్యాయవాదులు ఆదివారం ఆర్‌కే బీచ్‌లో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం కన్వీనర్ బెవర సత్యనారాయణ, అధ్యక్షుడు చింతపల్లి రాంబాబు మాట్లాడుతూ ఏపీ టైటిల్ యాక్ట్ -22ను తక్షణమే రద్దు చేయాలని కోరారు. అప్పటివరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామన్నారు. ఉపాధ్యక్షులు లత, కార్యదర్శి పైలా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. న్యాయవాదుల నిరసన ప్రదర్శన ఆర్‌కే బీచ్ వద్ద ప్రారంభమై వైఎంసీఏ వరకు సాగింది.

ఆకట్టుకున్న విద్యార్థుల నృత్య ప్రదర్శన


విద్యార్థినుల నృత్య ప్రదర్శన

కంచరపాలెం, ఫిబ్రవరి 18 : విద్యార్థుల్లో దాగి ఉన్న అంతర్గత నైపుణ్యాలను ఉపాధ్యాయులు వెలుగులోకి తీసుకురావాలని యల్లా ప్రగడ శ్రీధర్ అన్నారు. కంచరపాలెం దుర్గానగర్‌లో ఉన్న బీవీకే పాఠశాల వార్షికోత్సవంలో ఆదివారం ఆయన మాట్లాడారు. చిన్నారుల్లో ప్రతిభాపాటవాలను గుర్తించి వారిని ప్రోత్సహించాలని సూచించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఈ కార్య క్రమంలో పాఠశాల కరస్పాండెంట్ బీజేఎం రవికుమార్, ప్రిన్సిపాల్ వాగ్దేవు మహాలక్ష్మి పాల్గొన్నారు.

'ఫొటో జర్నలిస్టుపై దాడి హేయం'

విశాఖపట్నం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): వైసీపీ రాప్తాడులో నిర్వహించిన సిద్ధం సభలో 'ఆంధ్రజ్యోతి' ఫొటో జర్నలిస్టుపై దాడి చేయడం పత్రికా స్వేచ్ఛకు గొడ్డలిపెట్టు వంటిదని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ నజీర్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటనను విడుదల చేశారు. పత్రికా స్వేచ్ఛను కాపాడాల్సిన బాధత్య ప్రభుత్వం, యంత్రాంగంపై ఉందని, సాక్షాత్తూ సీఎం హాజరైన సభ వద్దే వైసీపీ నేతలు దాడులకు పాల్పడడం దారుణమన్నారు.

జగన్‌ను కీర్తించడానికి అంబేడ్కర్‌ను అవమానిస్తారా?

సిరిపురం, ఫిబ్రవరి 18 : జగన్‌ను కీర్తించడానికి అంబేడ్కర్‌ను అవమానిస్తారా అని విదసం రాష్ట్ర కన్వీనర్ బూసి వెంకటరావు ప్రశ్నించారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అంబేడ్కర్‌ను అవమానించినా వైసీపీలో ఉన్న దళితులకు ఆత్మగౌరవం గుర్తుకురాదన్నారు. పైగా విదేశీ విద్యా పథకానికి అంబేడ్కర్ పేరు తీసి జగన్ పేరు పెట్టినా సమ్మతమే అని జూపూడి ప్రకటించడం దళిత జాతిని జగన్‌కు తాకట్టు పెట్టడమేనన్నారు. అంబేడ్కర్ పేరు తీసి జగన్ పేరు పెట్టడాన్ని రాష్ట్రంలోని దళిత జాతి ఖండించిందన్నారు. జూపూడి సలహాదారు పదవి కోసం అంబేడ్కర్ పేరును తాకట్టు పెట్టడం జాతి అంగీకరించదన్నారు. తమకు డబ్బు కాదని అంబేడ్కర్ ఆశయం ముఖ్యమని చెప్పారు.

గ్రంథాలయాలకు తగ్గుతున్న ఆదరణ


రామారావును సత్కరిస్తున్న నిర్వాహకులు

సీతంపేట, ఫిబ్రవరి 18 : డిజిటల్, ఎలక్ట్రానిక్ బుక్స్, సెల్ ఫోన్ల ప్రభావం తో గ్రంథాలయాలకు ఆదరణ తగ్గుతుందని నాగార్జున యూనివర్శిటీ మాజీ వీసీ బాల మోహన్‌దాస్ అన్నారు. ద్వారకానగర్‌లోని పౌర గ్రంథాలయంలో విద్యావేత్త, గ్రంథాలయాల వ్యవస్థాపకుడు వెలగ వెం కటప్పయ్య పేరుతో అవార్డులు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాల విశిష్టతను, యువత వాటిని ఏ విధంగా వినియోగించుకోవాలో వివరించారు. అనంతరం లైబ్రేరీయన్ రామారావును నిర్వాహకులు సన్మానించారు. అలాగే లైబ్రేరీయన్ కోటేశ్వరరావు గ్రంథాలయాలపై రాసిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. సొసైటీ ఫర్ ప్రమోషన్ ఆఫ్ పబ్లిక్ లైబ్రరీస్ అధ్యక్షుడు బీఎస్ఎస్ మూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విశాఖ జిల్లా లైబ్రేరీయన్ వెంకటరావు, ప్రొఫెసర్ ఎస్. సాంబశివరావు, విశ్రాంత లైబ్రేరీయన్, మురళిధర్‌రావు, కోటేశ్వరావు, తదితరులు పాల్గొన్నారు.

కబ్జా చేసిన భూములు చూపిస్తే రాసిస్తా

- భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

సీతమ్మధార, ఫిబ్రవరి 18: తాను భీమిలిలో భూముల కబ్జాకు పాల్పడినట్టు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఆరోపించారని, ఆ భూములు చూపిస్తే అతనికే రాసిస్తానని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. సీతమ్మధారలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ భూకబ్జాలకు పాల్పడింది టీడీపీ నేతలేనన్నారు. దళితుడుకి రాజ్యసభ సీటు ఇచ్చిన గొప్ప చరిత్ర సీఎం జగన్‌దేనన్నారు. లోకేశ్‌కు ధైర్యం ఉంటే భీమిలిలో పోటీ చేయాలని సవాల్ చేశారు.

'కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి'

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 18 : కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నామని ఏపీ టెక్నాలజీస్ మాజీ చైర్మన్ కొయ్య ప్రసాద్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఎన్‌జీజీఓస్ కాలనీలో ప్రముఖ వ్యాపారవేత్త రాజులపల్లి శ్రీనివాసరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆధ్వర్యంలో పార్టీ ముందుకు సాగుతుందని, రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందన్నారు.



బాధితులకు వంట సామగ్రి అందజేస్తున్న దృశ్యం

అగ్నిప్రమాద బాధితులకు చేయూత

వేపగుంట, ఫిబ్రవరి 18: జీవీఎంసీ 98వ వార్డు పరిధి అప్పన్నపాలెంలో అగ్ని ప్రమాదం కారణంగా రోడ్డున పడిన కుటుంబానికి కర్రి అప్పలస్వామి చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు అండగా నిలిచారు. బాధిత మహిళ బొట్ట పైడమ్మ కుటుంబాన్ని ఆదివారం ఉదయం కర్రి అప్పలస్వామి చారిటబుల్ ట్రస్టు ప్రతినిధి కర్రి అప్పలస్వామినాయుడు, తదితరులు పరామర్శించి వంట సామగ్రి, నిత్యావసర సరకులు, గ్యాస్ స్టౌవ్, కొన్ని దుప్పట్లు, చీరలు అందజేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వ కూడా సాయం అందించాలని కోరారు. భవిష్యత్తులోనూ తాము పైడమ్మ కుటుంబానికి అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు పీతల అప్పలరాజు, పి.విష్ణు, ఈశ్వరరావు, అప్పలరాజు, కిరణ్, సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గంలో చురుగ్గా అభివృద్ధి పనులు: ఆనంద్‌కుమార్

మల్కాపురం, ఫిబ్రవరి 18: పశ్చిమ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయని వైసీపీ పశ్చిమ నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ పేర్కొన్నారు. 59వ వార్డులో పలు చోట్ల నిర్మాణాలను ప్రారంభించడంతో పాటు మరి కొన్నిచోట్ల అభివృద్ధి పనులకు ఆదివారం ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రజలకు వసతులు కల్పించడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పీవీ సురేశ్, వైఎస్సార్‌టీయూసీ పశ్చిమ ఇన్‌చార్జి పుర్రె సురేశ్, వైసీపీ 58వ వార్డు అధ్యక్షుడు ఆర్.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కాగా 58వ వార్డు కుంచమ్మకాలనీలో ఆదిపరాశక్తి రజక కుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన బల్లల పండగలో ఆడారి ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు. ఆయనకు రజకులు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. కార్పొరేటర్ గులిగిందల లావణ్య వైసీపీ వార్డు అధ్యక్షుడు దాట్ల శ్రీనివాసరాజు, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



గాజువాకలో తనిఖీలు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

గాజువాక, ఫిబ్రవరి 18: నిబంధనలను అతిక్రమించిన వాహనదారులపై పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై కఠిన చర్యలు చేపడుతున్నారు. మైనర్‌లు వాహనాలు నడిపినా, లైసెన్స్ లేకుండా, త్రిపుల్ రైడింగ్ చేసిన వారికి జరిమానా విధిస్తున్నారు. అదేవిధంగా ర్యాష్ డ్రైవింగ్ చేసిన వారిని పట్టుకుని చర్యలు తీసుకుంటున్నారు. ప్రతిఒక్కరూ తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, లేకుంటే తగిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

సమస్యలపై లోకేశ్‌కు వినతి..

అగనంపూడి, ఫిబ్రవరి 18: కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) కార్యాలయాన్ని ఫార్మాసిటీలో ఏర్పాటు చేయడంతో పాటు స్థానికంగా నెలకొన్న పలు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరుతూ టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేశ్‌కు 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ ఆధ్వర్యంలో పలువురు కలిసి వినతిపత్రం అందజేశారు. ఫార్మాసిటీ కాలుష్యం వల్ల పలు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. లోకేశ్‌ను కలిసిన వారిలో టీడీపీ నాయకులు పైలా జగన్నాథరావు, ఎం.నీలబాబు, అట్టా సన్యాసి అప్పారావు, తదితరులు ఉన్నారు.

సినిమా గైడ్

- **ఊరు పేరు భైరవకోన :** మెలోడి, సంగం, కామేశ్వరి, గోకుల్, శ్రీకన్య, ఊర్వశి, నరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), కన్య-2 (గాజువాక), దుర్గ (మధురవాడ), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)
- **ఈగల్ :** జగదాంబ, శరత్, రమాదేవి, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్ (పెందుర్తి), గణేష్ (తగరపువలస)
- **అంబాజీపేట మ్యారేజి బ్యాండు :** సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), లక్ష్మి (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **కెప్టెన్ మిల్లర్ :** వెంకటేశ్వర
- **హనుమాన్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీరామ, శారద, గోకుల్, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్ (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
- **గుంటూరు కారం :** లీలామహల్, సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 20, టమాటా 18, వంకాయలు (తెలుపు) 34, వంకాయలు (నలుపు) 60, బెండకాయలు 50, పచ్చిమిర్చి 38, కాకరకాయలు 44, బీరకాయలు 46, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 22, క్యాబేజీ 22, క్యారెట్ 24, దొండకాయలు 40, బంగాళదుంపలు 17, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 74, అల్లం (పాతది) 106, బరబాటి 28, ముల్లంగి 16, నిమ్మకాయలు (కిలో) 110, గోరుచిక్కుడు 40, దోసకాయలు 28, వెల్లుల్లి (పెద్దవి) 280, కొబ్బరికాయ (పెద్దది) 22, బీన్స్ (పెన్సిల్) 44, ఆగాకర 52, పొటల్స్ 62, కీరదోస 32, కాప్సికమ్ 55, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 52, చిలగడదుంపలు 30 , కంద 60, దేముడు చిక్కుడు 40, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 24, మామిడి అల్లం 60, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

చికెన్ ధరలు

బ్యాగ్		
రైతు ధర	--	115
ఫారం ధర	--	135
విత్ స్కిన్	--	240
స్కిన్‌లెస్	--	250

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..

జగన్ పాలనలో క్రిమినల్ కేపిటల్‌గా విశాఖ

లోకేశ్ శంఖారావ సభలో పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు

గోపాలపట్నం, ఫిబ్రవరి 18: ప్రశాంత విశాఖ నగరాన్ని సీఎం జగన్ తన పాలనలో క్రిమినల్ కేపిటల్‌గా మార్చారని పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు విమర్శించారు. స్థానిక బంక్ కూడలిలో ఆదివారం సాయంత్రం జరిగిన లోకేశ్ శంఖారావం సభలో ఆయన మాట్లాడుతూ వైసీపీ నేతలు విశాఖను కిడ్నాప్‌లు, అధికారుల హత్యలు, భూ దందాలకు కేంద్రంగా మార్చారన్నారు. నియోజకవర్గంలో ఎన్‌ఏడీ ఫ్లైఓవర్, ఆర్పీపేట అండర్‌పాస్‌వే నిర్మాణం చంద్రబాబు కృషితోనే జరిగాయన్నారు. ఆడుదాం ఆంధ్ర పేరుతో వైసీపీ ప్రభుత్వం రూ.100 కోట్ల ప్రజా ధనాన్ని వృథా చేసిందని, నగరంలో జరిగిన ఈ ముగింపు కార్యక్రమమే ఇందుకు నిదర్శనమన్నారు. కలెక్టర్ కార్యాలయం నుంచి గోపాలపట్నం రైతుబజారు వరకు ప్రభుత్వ ఆస్తులను తనఖా పెట్టిన ఘనత జగన్‌కే దక్కుతుందని మండిపడ్డారు. పశ్చిమ నియోజకవర్గంలో ప్రతి ఎన్నికల్లో ప్రత్యర్థులు డబ్బులు పంచుతున్నా ప్రజలు మాత్రం టీడీపీకే పట్టం కడుతుండడం అభినందనీయమన్నారు. తల్లికి, చెల్లికి కూడా నమ్మకం లేని జగన్‌లాంటి వ్యక్తిని రాష్ట్ర ప్రజలు నమ్మరని పేర్కొన్నారు. వైసీపీ దుర్మార్గ పాలన వల్ల రాష్ట్రానికి రాజధాని లేకుండా పోయిందన్నారు. మూతపడిన జింక్ కర్మాగారాన్ని పునఃప్రారంభించడానికి టీడీపీ హయాంలో ఒప్పందం చేసుకుంటే వైసీపీ ప్రభుత్వం రాగానే కనీసం పట్టించుకోలేదన్నారు. ఎల్జీ పాలిమర్స్ బాధితులను ఆదుకోవడంలో వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, బాధితులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని విమర్శించారు.



సభలో మాట్లాడుతున్న గణబాబు, దుర్గాప్రశాంతి

సీఎంకు మతి భ్రమించింది: జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి అంగ దుర్గా ప్రశాంతి

ప్రజలకు ఏమి చేస్తామో చెప్పకుండా రైతులు యుద్ధం చేయాలని చెబుతున్న సీఎం జగన్‌కు మతి భ్రమించిదని జనసేన పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి అంగ దుర్గాప్రశాంతి అన్నారు. సభలో ఆమె మాట్లాడుతూ జగన్ అధికారంలోకి వచ్చాక రాజధాని లేని రాష్ట్రంగా ఏపీకి దేశంలోనే గుర్తించి వచ్చిందని ఎద్దేవా చేశారు. జాబ్ క్యాలెండర్ ఇస్తానని చెప్పిన సీఎం జనాలకు సాక్షి క్యాలెండర్ ఇచ్చారని విమర్శించారు. ఆడపడుచులకు ముద్దులు పెడుతూ మద్యాన్ని నిషేధిస్తామని చెప్పి ఇప్పుడు అదే మద్యం ద్వారా కోట్లాది రూపాయలు దోచేస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో గద్దె దిగడానికి సిద్ధమని చెప్పడానికే జగన్ ఎక్కడికక్కడ 'సిద్ధం' ఫ్లెక్సీలను ఏర్పాటు చేసుకున్నారన్నారు. మళ్లీ వైసీపీకి అధికారమిస్తే రాష్ట్రాన్ని తాకట్టు పెట్టడానికి సిద్ధం అన్నట్టుగా జగన్ పోస్టర్ల ద్వారా జనాలకు చెబుతున్నారని చమత్కరించారు. జనసేన-టీడీపీ ప్రభుత్వాన్ని అధికారంలోకి తెచ్చేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు.



అప్పలనరసింహం విగ్రహాన్ని ఆవిష్కరించాక పూలమాల వేస్తున్న లోకేశ్



లోకేశ్‌తో కరచాలనం చేసేందుకు ఉత్సాహం చూపుతున్న అభిమానులు

మాజీ ఎంపీ పెతకంశెట్టి అప్పలనరసింహం విగ్రహావిష్కరణ

గోపాలపట్నం, ఫిబ్రవరి 18: పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు తండ్రి, మాజీ ఎంపీ దివంగత పెతకంశెట్టి అప్పలనరసింహం విగ్రహాన్ని తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి నారా లోకేశ్ ఆదివారం ఆవిష్కరించారు. గోపాలపట్నంలో జరిగిన శంఖారావం సభలో పాల్గొనడానికి విచ్చేసిన ఆయన గణబాబు నివాసం వద్ద ఏర్పాటు చేసిన పెతకంశెట్టి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్‌తో కరచాలనం చేసేందుకు పోటీ పడిన అభిమానులు, కార్యకర్తలు

కాగా ఈ కార్యక్రమంలో పాల్గొన్న లోకేశ్‌తో కరచాలనం చేసేందుకు అభిమానులు, కార్యకర్తలు పోటీ పడ్డారు. గణబాబు నివాసానికి లోకేశ్ వస్తున్నట్టు తెలుసుకున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అక్కడకు ఆదివారం మధ్యాహ్నం మూడు గంటలకే పెద్దసంఖ్యలో చేరుకున్నారు. సాయంత్రం ఐదు గంటల సమయంలో గణబాబు నివాసం వద్దకు లోకేశ్ కాన్వాయ్ చేరుకుంది.

ఈ సమయంలో కాన్వాయ్ నుంచి బయటకు వచ్చిన లోకేశ్‌తో కరచాలనం చేయడానికి కార్యకర్తలు, జనాలు ఎగబడ్డారు. లోకేశ్ కూడా ఎంతో హుషారుగా కార్యకర్తలు, అభిమానులతో కరచాలనం చేస్తూ ముందుకు సాగారు. కాగా శంఖారావం సభలో లోకేశ్ ప్రసంగానికి కార్యకర్తలు, ఈలలు వేస్తూ ఉత్సాహంగా కేరింతలు కొట్టారు.



కొత్తపాలెం శివారులోని వ్యవసాయ క్షేత్రంలో వలస పక్షులు



ఆహారం తింటున్న పక్షులు

కొత్తపాలెం శివారులో కనువిందు చేస్తున్న వలస పక్షులు

గోపాలపట్నం, ఫిబ్రవరి 18: ప్రతి సంవత్సరం వేసవి సమీపించే సమయంలో కొత్తపాలెం శివారు ప్రాంతంలోని వ్యవసాయ క్షేత్రానికి వచ్చే వలస పక్షులు ఈ ఏడాది కూడా దర్శనమిస్తున్నాయి. 89వ వార్డు పరిధి కొత్తపాలెం నుంచి నరవ గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా గల వ్యవసాయ క్షేత్రాలకు ఏటా వలస పక్షులు వస్తుంటాయి. ఈ ప్రాంతానికి సమీపంలో మేఘాద్రిగెడ్డ రిజర్వాయర్ కాలవ ఉండటంతో పాటు వ్యసాయ క్షేత్రాల్లో నీటి మడుగులు ఉండడంతో ఇక్కడకు పెద్దసంఖ్యలో వలస పక్షులు వస్తుంటాయి. ఈ మార్గంలో రాకపోకలు సాగించే వారంతా ఈ పక్షులను ఎంతో ఆసక్తిగా తిలకిస్తున్నారు. అయితే కాగా గత కొన్నాళ్లుగా ఈ పక్షుల సంఖ్య తగ్గుముఖం పడుతూ వస్తుందని పలువురు పేర్కొంటున్నారు. శివారు ప్రాంతంలో రియల్ వ్యాపారం జోరందుకోవడంతో వ్యవసాయ క్షేత్రాలు కూడా జనావాసాలుగా మారుతుండడంతో వలస పక్షుల సంఖ్య తగ్గుతుందని స్థానికులు చెబుతున్నారు.





గాజువాక లంకా మైదానంలో సిద్ధమవుతున్న సభా వేదిక.. పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న పల్లా శ్రీనివాసరావు

గాజువాకలో నేడే లోకేశ్ శంఖారావం సభ

గాజువాక, ఫిబ్రవరి 18: గాజువాక లంకా మైదానంలో సోమవారం తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి నారా లోకేశ్ శంఖారావ సభ జరగనున్నది. ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఈ సభను నిర్వహించేందుకు ఇప్పటికే పార్టీ శ్రేణులు ఏర్పాట్లు చేశారు. సోమవారం ఉదయం 11 గంటలకు సభ ప్రారంభం కానున్న నేపథ్యంలో వచ్చిన వారందరికీ భోజనాలు ఏర్పాటు చేసేందుకు తగిన చర్యలు చేపట్టారు. అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, ప్రజలు సభకు తరలి రానున్నందున వారికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పార్టీ శ్రేణులతో పాటు పోలీసులు కూడా చర్యలు తీసుకుంటున్నారు.

సభను సక్సెస్ చేయాలి

ఇక్కడి లంకా మైదానంలో సోమవారం జరగనున్న లోకేశ్ శంఖారావం సభకు అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, అన్ని వర్గాల ప్రజలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా టీడీపీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు కోరారు. ఇక్కడి

ఏర్పాట్లు పూర్తి చేసిన పార్టీ శ్రేణులు
కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి
టీడీపీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గాజువాకలో అత్యంత వేడుకగా ఈ సభను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన విజయం తథ్యమని, సీఎం జగన్‌కు బుద్ధి చెప్పేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, నాయకులు నల్లూరు సూర్యనారాయణ, పులి వెంకటరమణారెడ్డి, మొల్లి పెంటిరాజు, గణపతి, తదితరులు పాల్గొన్నారు.

కూర్మన్నపాలెం: నారా లోకేశ్ శంఖారావం సభను నియోజకవర్గ ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాల్సిందిగా టీడీపీ 86వ వార్డు ఇన్‌చార్జి నల్లూరు సూర్యనారాయణ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వుడా నగర్‌లో ఆదివారం ఆయన ఇంటింటికీ వెళ్లి లోకేశ్ సభకు హాజరు కావాలని కోరారు. రానున్న ఎన్నికల్లో వైసీపీకి చరమగీతం పాడాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వేగుంట శ్రీనివాస్, ఎం.కనకరాజు, తదితరులు పాల్గొన్నారు. అలాగే 88వ వార్డు దువ్వాడలో కార్పొరేటర్ మొల్లి ముత్యాలనాయుడు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన శంఖారావం సభను విజయవంతం చేయాలని కోరారు.

పెదగంట్యాడ: లోకేశ్ శంఖారావం సభకు మండలం నుంచి అధిక సంఖ్యలో పాల్గొనవలసిందిగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి కోరారు. పార్టీ కార్యాలయంలో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ సభను విజయవంతం చేసి రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయానికి ఇదే సంకేతం అన్నట్టు చేయాలన్నారు. సమావేశంలో నాయకులు పులి వెంకటరమణారెడ్డి, గోక్యాడ ముత్యాలు, నమ్మి అప్పారావు, డి.పెరుమాళ్లు, ఎస్.శ్రీనివాసరావు, ఎం.పెంటయ్య, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పతనం తథ్యం

జనసేన పీఏసీ సభ్యుడు కోన తాతారావు

కూర్మన్నపాలెం, ఫిబ్రవరి 18: ప్రజల విశ్వాసం కోల్పోయిన వైసీపీ పతనం తథ్యమని జనసేన పీఏసీ సభ్యుడు కోన తాతారావు అన్నారు. 87వ వార్డు పరిధి వడ్లపూడి, కణితి, తిరుమలనగర్, సిద్ధార్థనగర్, రాజులపాలెం, లక్ష్మీపురం, కూర్మన్నపాలెం, అప్పికొండ, కాశీపాలెంలలో ఆదివారం జనసేన పార్టీ ఆధ్వర్యంలో పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన-టీడీపీ పొత్తుతో వైసీపీ ఓటమి ఖాయమన్నారు. వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యమని, ఏటా జాబ్ క్యాలెండర్ అంటూ నిరుద్యోగులను మోసం చేసిందని, మహిళలకు రక్షణ కరువైందని, ప్రతిపక్ష నేతలపై అక్రమ కేసులు పెట్టడం, వ్యవస్థలను అడ్డం పెట్టుకుని కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం తప్ప చేసేందేమీ లేదని విమర్శించారు. వైసీపీ పాలనతో విసిగి వేసారిన జనం రానున్న ఎన్నికల్లో ఆ పార్టీని ఓడించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.



పాదయాత్రలో పాల్గొన్న కోన తాతారావు, తదితరులు

ఈ కార్యక్రమంలో నాయకులు సిరసపల్లి కనకరాజు, తోట ప్రియదర్శిని, కాద శ్రీను, జి.అప్పారావు, డి.గోవిందరెడ్డి, కె.కనకారావు, ఎల్.మురళీదేవి, జ్యోతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన సముపార్జన కోసం పుస్తకాలు చదవాలి

పెదగంట్యాడ, ఫిబ్రవరి 18: విజ్ఞానాన్ని, వ్యక్తిత్వ వికాసాన్ని సముపార్జించేందుకు పుస్తకాలను చదవాలని పెదగంట్యాడ శాఖా గ్రంథాలయాధికారి పీవీ రమణ విద్యార్థులకు సూచించారు. చదవడం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా ఆదివారం గ్రంథాలయంలో ఆయన విద్యార్థులతో పలు పుస్తకాలు చదివించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు, ఇంగ్లిష్, హిందీ భాషల్లో వివిధ రకాల పుస్తకాలు ఉన్నాయని, వీటిని చదవడం వల్ల అన్ని అంశాల్లోనూ పరిజ్ఞానం పెరుగుతుందని, భాష పట్ల మంచి అవగాహన ఏర్పడుతుందన్నారు. విద్యార్థులు తరగతి పుస్తకాలతో పాటు అన్ని పుసకాలను చదవాలన్నారు.



రాజశ్యామల అమ్మవారికి హారతిస్తున్న స్వరూపానందేంద్ర సరస్వతి

వైభవంగా శారదా పీఠం వార్షికోత్సవాలు

పెందుర్తి, ఫిబ్రవరి 18: చినముషిడవాడలో శారదా పీఠం వార్షికోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం వల్లి, దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామిని ప్రత్యేకంగా అలంకరించగా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి విశేష అభిషేకాలు చేసి హారతులిచ్చారు. పీఠం యాగశాలలో మహారుద్ర సహిత లక్షమూల మంత్ర రాజశ్యామల యాగాన్ని రుత్వికులు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. యాగశాలలో లోక సుభిక్షాన్ని కాంక్షిస్తూ సుబ్రహ్మణ్య, మన్యుసూక్త వనదుర్గ హోమాలు, చంద్ర మౌళీశ్వరులకు పీఠార్చన చేశారు. కాగా పీఠం అధిష్ఠాన దేవత శారదా స్వరూప రాజ్యశ్యామల అమ్మవారు వారాహి ప్రత్యంగిరాదేవి సహిత నర్తనకాళి రూపంలో మివ్వగా, పీఠాధిపతి హారతులిచ్చారు. ఈ వేడుకల్లో భాగంగా సాయంత్రం సుబ్రహ్మణ్యస్వామి తిరువీధి రథోత్సవాన్ని స్వరూపానందేంద్ర సరస్వతి పర్యవేక్షణలో ఘనంగా నిర్వహించారు. అనంతరం పీఠం ప్రాంగణంలో వల్లి, దేవసేన, సుబ్రహ్మణ్యస్వామి కల్యాణాన్ని జరిపారు.

నేడు బీహెచ్‌పీవీ ప్రసన్నగిరి ప్రదక్షణ



అక్కిరెడ్డిపాలెం, ఫిబ్రవరి 18: ఏటా ఎంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే బీహెచ్‌పీవీ ప్రసన్నగిరి ప్రదక్షణ సోమవారం జరగ నున్నది. భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని బీహెచ్‌పీవీ ప్రసన్నగిరిపై గల వేంకటేశ్వర వినాయకస్వామి దేవస్థానం వార్షికోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం ఆరు గంటలకు నిర్వహించే ప్రసన్నగిరి ప్రదక్షణలో స్వామివారి పల్లకీ ఊరేగింపుతో పాటు 108 కలశాలతో భక్తులు మూడుసార్లు కొండ చుట్టూ ప్రదక్షణలు చేయనున్నారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొననున్నందున వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పాలక మండలి సభ్యులు ఏర్పాట్లు చేశారు.

దుర్గానగర్‌లోని లారీని తరలించరూ..

గంజాయితో పట్టుబడిన వాహనాన్ని సీజ్ చేసి ఇక్కడ వదిలేసిన అధికారులు
మూడేళ్లవుతున్నా దీని గురించి పట్టించుకునేవారే కరువాయె..



మూడేళ్లుగా బీఆర్‌టీఎస్ రోడ్డు పక్కన ఉన్న లారీ

వేపగుంట, ఫిబ్రవరి 18: గంజాయి తరలిస్తుండగా నాయుడుతోట దుర్గానగర్‌లో పట్టుబడిన వాహనాన్ని సంబంధిత అధికారులు సీజ్ చేసి బీఆర్‌టీఎస్ సర్వీస్ రోడ్డులో పెట్టి మూడేళ్లవుతున్నా దీనిని అక్కడ నుంచి తరలించడం లేదు. రోడ్డుపైనే ఈ లారీని విడిచిపెట్టి వదిలేయడం వల్ల ఈ ప్రదేశంలో తారు రోడ్డు నిర్మాణం కూడా నిలిచిపోయింది. ఇప్పటికే ఈ లారీకి ఉన్న కొన్ని టైర్లను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకుపోయారు. ఈ వాహనాన్ని పూర్తి స్థాయిలో పక్కకు జరపడం కూడా కష్టసాధ్యమే. నెల రోజుల క్రితం బీఆర్‌టీఎస్ మూడు లేన్ల రహదారిలో తారు రోడ్డు నిర్మాణం చేపట్టారు. అయితే దుర్గానగర్‌కు వచ్చేసరికి ఇక్కడి లారీ అడ్డంగా ఉన్నందున సంబంధిత కాంట్రాక్టరు సుమారు పది మీటర్ల వరకు రోడ్డు వేయకుండా వదిలివేసినట్టు తెలిసింది. కాగా సీఎం జగన్ చినముషిడివాడలోని శారదా పీఠాన్ని సందర్శించే అవకాశం ఉన్నందున ఈ మార్గంలోని డివైడర్లకు పెయింటింగ్‌లు వేయడంతో పాటు గుంతల పూడ్చివేత, తదితర పనులు చేపడుతున్నారు. పనిలో పనిగా మూడేళ్లుగా ఇక్కడ వదిలేసిన లారీని కూడా వేరే ప్రాంతానికి తరలించేలా అధికారులు తగిన ఏర్పాట్లు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఘనంగా కోదండరామ పరస

ఎన్.ఎ.డి.జంక్షన్, ఫిబ్రవరి 18: బాజీ జంక్షన్‌లోని చినబుచ్చిరాజుపాలెంలో కోదండరామ పరసను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలోని స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. వైసీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడారి ఆనంద్‌కుమార్ కోదండరాముని దర్శించుకుని పూజలు జరిపారు. సాయంత్రం ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ కో-ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు, వైసీపీ నాయకులు జి.మురళీకృష్ణ, జి.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ పర్యటన అంటేనే భయాందోళన చెందుతున్న వ్యాపారులు

వేపగుంట, ఫిబ్రవరి 18: సీఎం పర్యటన ఉందన్న సమాచారంతో ఎన్.ఎ.డి. జంక్షన్ నుంచి చినముషిలవాడ వరకు ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు నిర్వహించే వారంతా భయాందోళనకు గురవుతున్నారు. శారదాపీఠం వార్షికోత్సవాల్లో భాగంగా ముగింపు కార్యక్రమానికి హాజరయ్యేందుకు గాను సీఎం ఈ నెల 19 లేదా 20 తేదీల్లో వచ్చే అవకాశం ఉన్నందున తోపుడుబళ్లు, టిఫిన్ సెంటర్లు, కూరగాయల వ్యాపారాలను చేపట్టరాదని సచివాలయం సిబ్బంది, గ్రేటర్ అధికారులు మౌఖిక ఆదేశాలు జారీ చేస్తున్నట్టు తెలిసింది. సీఎం పర్యటన ఇంకా ఖరారు కాకముందే ఆదేశాలు జారీ చేస్తుండడంపై ఫుట్‌పాత్ వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. గతంలో సీఎం పర్యటన సమయంలో ఉదయం నుంచి సాయంత్రం నాలుగు వరకు ఆయా మార్గాల్లోని దుకాణాలను మూసివేసిన సంగతి తెలిసిందే. ముఖ్యమంత్రి వచ్చినప్పుడల్లా చిరు వ్యాపారాలు సాగించే తమను ఇబ్బందులకు గురిచేయడం ఎంతవరకు సమంజసమని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

'వైసీపీ హయాంలో ఉత్తరాంధ్రకు అన్యాయం'

మల్కాపురం, ఫిబ్రవరి 18: వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉత్తరాంధ్రకు అన్యాయం జరిగిందని, ముఖ్యంగా విశాఖలో ఎటువంటి అభివృద్ధి లేదని టీడీపీ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి పాండ్రంగి జయరాజు నాయుడు అన్నారు. కొత్తనక్కవానిపాలెంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ హయాంలోనే ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందిందన్నారు. అన్ని వర్గాల ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్న వైసీపీకి రానున్న ఎన్నికల్లో ఓటు అనే ఆయుధంతో తగిన బుద్ధి చెప్పాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు అప్పలరాజు, మోహన్‌దాసు, గురునాథ్, అర్జున్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు దుర్గమాంబ ఆలయ వార్షికోత్సవం

అగనంపూడి, ఫిబ్రవరి 18: జీవీఎంసీ 85వ వార్డు పరిధి ఉక్కు నిర్వాసిత కాలనీ డొంకాడ ప్రజల ఆరాధ్య దైవం దుర్గమాంబ ఆలయ 21వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, సాయంత్రం పరస జరుపుతారు.

అవినీతికి కేరాఫ్ ఎమ్మెల్యే వాసుపల్లి



ఇందిరా మునిసిపల్ స్టేడియంలో జరిగిన శంఖారావం సభలో మాట్లాడుతున్న నారా లోకేశ్


సభలో ప్రతిజ్ఞ చేస్తున్న పార్టీ శ్రేణులు, అభిమానులు, మహిళా కార్యకర్తలు


శంఖారావం సభలో మాట్లాడుతున్న గండి బాబ్జీ

- దక్షిణ టీడీపీ ఇన్‌చార్జి గండి బాబ్జీ
- శంఖారావం సభ సూపర్ సక్సెస్
- పార్టీ శ్రేణుల్లో ఫుల్ జోష్

పూర్ణామార్కెట్, ఫిబ్రవరి 18: విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వాసుపల్లి గణేశ్‌కుమార్ అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీ ధ్వజమెత్తారు. ఇందిరా మునిసిపల్ స్టేడియంలో ఆదివారం జరిగిన టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేశ్ శంఖరావం సభలో ఆయన మాట్లాడారు. వైసీపీ నేతలకు విద్యాలయాల్లో మద్యం సీసాలను పంపిణీ చేసి వాసుపల్లి నియోజవర్గానికే మాయని మచ్చ తెచ్చారన్నారు. టీడీపీ నుంచి పోటీచేశారని ప్రజలు గెలిపిస్తే తన కాలేజీలు, భూముల రక్షణ కోసం వైపీపీ పంచన చేరారని ఆరోపించారు. నియోజకవర్గంలో కాలుష్యం ప్రధాన సమస్యగా ఉందని, అధికారంలోకి వస్తే ఈ సమస్యను పరిష్కరిం చేలా చూడాలని లోకేశ్‌ను కోరారు. రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచినా వన్‌టౌన్ ప్రజానీకం ఎదుర్కొంటున్న కాలుష్యం సమస్య పరిష్కరించడంలో విఫలమయ్యారన్నారు. నియోజకవర్గ పరిధిలోని ఏవార్డులో చూసినా సమస్యలు రాజ్యమేలుతున్నాయన్నారు. తాగునీరు అందడం లేదని, గోతులదారులతో ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. టీడీపీ హయాంలో పంపిణీ చేసిన గృహాలను తన అనుచరులతో కలిసి లబ్ధిదారుల జాబితాలను తారుమారు చేసి అమ్ముకున్న ఘనత వాసుపల్లిదేనన్నారు. వైసీపీ పథకాల్లోనూ ఎమ్మెల్యే దోపిడీ ఆగలేదన్నారు. ఫిషింగ్ హార్బర్ ప్రమాదంలో 40 బోట్లు కాలిపోతే పార్టీ తరఫున బాధితులకు రూ.60 లక్షలు నష్ట పరిహారం అందించామన్నారు. బోట్లలో పనిచేసే కార్మికులకు పది వేలు చొప్పున ఇస్తామని చెప్పిన ప్రభుత్వం.. ఇప్పటికీ చెల్లించలేదన్నారు. విశాఖకు ఎంతో చరిత్ర ఉందని, అంతే చరిత్ర వన్‌టౌన్ ప్రాంతానికి ఉందన్నారు. ఈ నియోజకవర్గంలో ఎంతో మంది ప్రజలు టిడ్కో ఇళ్లకు డబ్బులు కట్టారని, ఇప్పటికీ వారికి ఇళ్లు ఇవ్వలేదన్నారు. సమావేశానికి వస్తే పథకాలు నిలిపివేస్తామని బెదిరించినా భయపడకుండా హాజరైన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో టీడీపీ, జనసేన ప్రభుత్వం దక్షిణ నియోజవర్గం అభివృద్ధికి చిత్తశుద్ధితో, అవినీతి రహితంగా పనిచేస్తుందని హామీ ఇచ్చారు.

అనంతరం జనసేన దక్షిణ ఇన్‌చార్జి ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ టీడీపీ జనసేన మైత్రీ బంధాన్ని విచ్ఛిన్నం చేసేందుకు సజ్జల భార్గవరెడ్డి సోషల్ మీడియా ద్వారా కుట్రలు పన్నుతున్నారన్నారు. దక్షిణంలో వైసీపీ అడ్రస్ గల్లంతవుతుందన్నారు. ఎమ్మెల్యే వాసుపల్లి నియోజవర్గాన్ని అవినీతిమయం చేశారని దుయ్యబట్టారు. వైసీపీ కార్యకర్తలు, ఎమ్మెల్యే అనుచరగణం దోపిడీకి అడ్డులేకుండా పోతోందన్నారు. సభకు తెలుగుదేశం, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు, మహిళలు భారీ సంఖ్యలో హాజరయ్యారు.

టీడీపీ శ్రేణుల్లో ఫుల్ జోష్..

జగదాంబ కూడలి: టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేశ్ ఆదివారం నిర్వహించిన శంఖారావం సభ భారీగా సక్సెస్ కావడం పార్టీశ్రేణుల్లో జోష్ నింపింది. ఇందిరా మునిసిపల్ స్టేడియంలో జరిగిన సభకు పలు వార్డులకు చెందిన నాయకులు, కార్యకర్తలు ఊరేగింపుగా సభాస్థలికి తరలివచ్చారు. జగదాంబ జంక్షన్ నుంచి పాతపోస్టాఫీసు వెలంపేట, పూర్ణామార్కెట్, ఏవీఎన్, జాలరిపేట, రెల్లివీధి పరిసరాలు మధ్యాహ్నం నుంచి టీడీపీ జెండాలతో నిండిపోయాయి. సభలో యువత, మహిళలు అధికసంఖ్యలో కనిపించారు. లోకేశ్‌తో కరచాలనం చేసేందుకు, సెల్ఫీలు తీసుకునేందుకు పార్టీశ్రేణులతో పాటు మహిళలు పోటీ పడ్డారు. మధ్యాహ్నం రెండు గంటలకే స్టేడియం జనంతో నిండి పోయింది. దీంతో నియోజకవర్గ టీడీపీ నేతల్లో జోష్ కనిపించింది.

ముస్లింలకు అండగా టీడీపీ: లోకేశ్

- జ్ఞాపికను బహూకరించిన మైనారిటీ నేతలు

మహారాణిపేట: రాష్ట్రంలో ముస్లిం మైనారిటీలకు టీడీపీ అండగా నిలుస్తోందని, భవిష్యత్తులో వారికి మరింత ప్రాధాన్యం కల్పిస్తామని టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేశ్ ప్రకటించారు. శంఖారావం కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన లోకేశ్‌ను నగరంలోని పలువురు ముస్లిం మైనారిటీ నాయకులు కలిసి జ్ఞాపికను అందజేశారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ నజీర్ ఆధ్వర్యంలో లోకేశ్‌ను కలిశారు. జిల్లాలో ముస్లింలు అంతా తెలుగుదేశం పార్టీ విజయానికి కృషిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గండి బాబ్జీ, అబ్దుల్ చినరెహమాన్, జఫ్రుల్లా, బొట్టా పరదేశియాదవ్, తదితరులు పాల్గొన్నారు.


నారా లోకేశ్‌కు జ్ఞాపికను బహూకరిస్తున్న ముస్లిం మైనారిటీ నాయకులు, చిత్రంలో పార్టీ కార్యదర్శి నజీర్

జాబ్ కేపిటల్‌గా విశాఖ

... 5వ పేజీ తరువాయి

ఇచ్చారు. ఓపెన్ డ్రెయిన్లు ఈ ప్రాంతంలో ప్రధాన సమస్యగా ఉన్నాయని, భూగర్భ డ్రెయిన్లుగా మార్చేలా చర్యలు తీసుకుంటామన్నారు.

టీడీపీకి బలమే కార్యకర్తలు

తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే బలమని లోకేశ్ అన్నారు. ఇక్కడ ఎమ్మెల్యే పార్టీ మారినా కార్యకర్తలు అండగా ఉన్నారన్నారు. కష్టపడి పనిచేసే కార్యకర్తలకు భవిష్యత్తులో ఉన్నత స్థానాలను కల్పిస్తానని లోకేశ్ హామీ ఇచ్చారు. రానున్న రెండు నెలలు కష్టపడి పార్టీని అధికారంలోకి తీసుకురావాలని, ఇంటింటికీ వెళ్లి 'సూపర్ సిక్స్' పథకాల గురించి వివరించాలన్నారు.

టీడీపీ, జనసేన కార్యకర్తల మధ్య చిచ్చు పెట్టేందుకు ఐదు రూపాయలు ఇస్తే పోస్టులు పెట్టే కొంతమంది యత్నిస్తున్నారని, వారి విషయంలో అప్రమత్తంగా ఉండాలని నారా లోకేశ్ సూచించారు. టీడీపీ, జనసేన కార్యకర్తల లక్ష్యం ఒక్కటేనని, 'హలో ఏపీ, బైబై వైసీపీ' అని లోకేశ్ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. నాయకులు, కార్యకర్తలపై అక్రమంగా కేసులు పెట్టి వేధించిన అధికారులు, వైసీపీ నాయకులపై అధికారంలోకి వచ్చిన తరువాత చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు. తాను రెడ్ బుక్ పట్టుకుని తిరుగుతుంటే వైసీపీ నాయకులకు భయం పట్టుకుందని, దీనిపై కోర్టుకు వెళుతున్నారని పేర్కొన్నారు. దమ్ము, ధైర్యం ఉంటే తనను అరెస్టు చేయాలని లోకేశ్ అన్నారు.

జీవీఎంసీలో అవినీతి

జీవీఎంసీలో పెద్దఎత్తున అవినీతికి పాల్పడుతున్నారని, ఒక్క రోడ్డు, డ్రైన్ వేయలేదని, పన్నులు మాత్రం వసూలు చేస్తున్నారని విమర్శించారు. పన్నులు కట్టకపోతే పెన్షన్లు కట్ చేస్తున్నారని, ఇటువంటి ప్రభుత్వాన్ని ఎక్కడైనా చూశారా? ...అని లోకేశ్ ప్రశ్నించారు. మత సామరస్యానికి దక్షిణ నియోజకవర్గం మారు పేరని, ఇక్కడ ఒకే కొండపై గుడి, చర్చి, మసీదు ఉంటాయని, విశాఖ సౌత్‌ను ఓల్డ్ సిటీగా పేర్కొంటారని, అటువంటి సిటీలోని ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని లోకేశ్ ఆవేదన వ్యక్తం చేవారు. ఈ ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక ఉందని, అధికారంలోకి వచ్చిన వెంటనే ఇక్కడున్న నిరుపేదలకు పక్కా ఇళ్లు కట్టించే బాధ్యతను తాను తీసుకుంటానని ఆయన స్పష్టం చేశారు.

తాము గతంలో ఒక పొరపాటు చేశామని, ఇక్కడి ప్రజలు వద్దన్నా రెండుసార్లు ఒక వ్యక్తికి ఎమ్మెల్యే టికెట్ ఇచ్చామని పరోక్షంగా వాసుపల్లి గురించి లోకేశ్ ప్రస్తావించారు. ఆయన వ్యక్తిగత స్వార్థం కోసం పార్టీ మారాడన్నారు. అటువంటి వ్యక్తులకు టీడీపీలోకి ఎంట్రీ లేదని, అటువంటి వ్యక్తికి టికెట్ ఇచ్చినందుకు తమను మన్నించాలని ఈ సందర్భంగా లోకేశ్ కోరారు. జైహింద్ అంటూ నీతీ, నిజాయితీలు కలిగిన వ్యక్తిలా ఇక్కడి ఎమ్మెల్యే మాట్లాడుతుంటాడని, వైసీపీలోకి వెళ్లిన తరువాత చిన్న దొంగగా మారాడని ఆరోపించారు. పేదలకు రావాల్సిన ఉద్యోగాలను డబ్బులకు అమ్ముకుంటున్నాడని విమర్శించారు. ఇప్పుడున్న ఎమ్మెల్యేను చిత్తుచిత్తుగా ఓడించాలని లోకేష్ ప్రజలకు పిలుపునిచ్చారు.

ఐరన్ లెగ్ జగన్

... 5వ పేజీ తరువాయి

మంచిదన్నారు. గతంలో ఎన్నడూ చూడనన్ని ప్రమాదాలను విశాఖ నాలుగున్నరేళ్లలో చూసిందన్నారు. గతంలో చంద్రబాబు నాయుడు విశాఖ వైపు ప్రపంచం చూసేలా అభివృద్ధి చేశారని, జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత నాశనం చేశాడన్నారు. జగన్ అక్రమంగా కట్టిన భవనాలను జప్తు చేసి అమ్మి ప్రజలకు పంచి పెడతామని లోకేశ్ అన్నారు. ఎన్నికల సమయం దగ్గరపడుతున్న తరుణంలో వైసీపీ నాయకులు ఓటుకు పది వేలు ఇస్తామంటారని, అడ్డంగా దోచుకున్న వైసీపీ నాయకులు నుంచి డబ్బులు తీసుకుని టీడీపీ, జనసేన అభ్యర్థులకు ఓటేయాలని లోకేశ్ సూచించారు. టీడీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే విద్యార్థుల మెస్ చార్జీలు పెంచుతామని, వసతి గృహాలను ఆధునికీకరిస్తామన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టేందుకు జగన్ సిద్ధపడుతున్నాడని, దీనికి కారణం ప్రైవేటు వ్యక్తులతో కుమ్మక్కు కావడమే నిదర్శనమన్నారు.

ఏయూ వీసీ ప్రసాదరెడ్డి అక్రమాలపై విచారణ

ఏయూ వీసీ ప్రసాదరెడ్డి చేసిన అక్రమాలపై విచారణ జరిపించి డిస్మిస్ చేసి జైలులో పెట్టిస్తామని లోకేశ్ అన్నారు. ప్రసాదరెడ్డి అక్రమాలన్నీ రెడ్‌బుక్‌లో ఉన్నాయన్నారు. టీడీఆర్ బాండ్లలో ఎంపీ విజయసాయిరెడ్డి భారీఎత్తున అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. పెదజాలరిపేట, బిలాల్ కాలనీ, మధురవాడల్లో టీడీఆర్ బాండ్ల పేరుతో వైకాపా నాయకులు రూ.వేల కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. దసపల్లా భూములు కొట్టేశారని ఆరోపిస్తూ..వీటన్నింటిపై ప్రభుత్వం వచ్చిన తరువాత విచారణ జరిపి వడ్డీతో సహా కక్కిస్తామన్నారు. ఎల్‌జీ పాలిమర్స్ స్థానంలో కాలుష్యం లేని పరిశ్రమలు తీసుకువచ్చి స్థానికులకు ఉపాధి కల్పిస్తామని లోకేశ్ ప్రకటించారు. జింక్ పరిశ్రమ ప్రాంతంలో కూడా కొత్త పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. తమ హయాంలో ఎన్ఏడీ పై ఓవర్, గోపాలపట్నంలో బీటీ, సీసీ రహదారులతోపాటు ఇండోర్ స్టేడియం నిర్మించామని లోకేశ్ వివరించారు.

నేడు ఉత్తర, గాజువాకలో లోకేశ్ శంఖారావం

విశాఖపట్నం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ సోమవారం విశాఖ ఉత్తర, గాజువాకలో శంఖారావం సభలలో పాల్గొంటారు. ఉదయం పదిగంటలకు విశాఖ ఉత్తర బిర్లాజంక్షన్ దరి మైదానంలో శంఖారావం సభకు హాజరవుతారు. పార్టీకేడర్‌తో సమావేశం, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు, జనసేన ఇన్‌చార్జి పసుపులేటి ఉషాకిరణ్, విశాఖ పార్లమెంటు అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎం.శ్రీభరత్‌లు ప్రసంగిస్తారు. అనంతరం లోకేశ్ మాట్లాడతారు. తరువాత పాత గాజువాక లంకా మైదానంలో శంఖారావం సభకు హాజరవుతారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి మూడు గంటల వరకు సభ నిర్వహిస్తారు. గాజువాక సభ ముగిసిన తరువాత అనకాపల్లి, చోడవరం సభలలో పాల్గొంటారు.

మ్యూజియం మరమ్మతుల్లో మహా మాయ

... 5వ పేజీ తరువాయి

పెద్దలు సరిగ్గా దీనినే తమకు అవకాశంగా మార్చుకున్నారు. మిలాన్ నేపథ్యంలో బీచ్‌రోడ్డులోని విశాఖ మ్యూజియం గోడలకు పుట్టీలు, రంగులు వేయడంతోపాటు పీఓపీ సీలింగ్ పనులు, నడకదారులకు రంగులు, ఇత్తడి నేమ్‌బోర్డు ఏర్పాటు, మరుగుదొడ్ల మరమ్మతులు పేరుతో సుమారు రూ.1.4 కోట్ల విలువైన పనులను ప్రతిపాదించారు. అన్ని పనులను కలిపి ఒకే టెండరు పిలవడమో లేదంటే పెయింటింగ్‌లు, సివిల్ వర్కులను నాలుగైదు పనులుగా విభజించి టెండర్లు పిలవడమో చేయాలి. కానీ అలా చేస్తే రూ.ఐదు లక్షల కంటే ఎక్కువ అయిపోతుంది కాబట్టి, టెండరు పిలవాల్సి వస్తుందని అధికారులు భావించారు. అలాకాకుండా రూ.ఐదు లక్షలలోపు ఉండేలా ఒక్కో పనిని ముక్కలుగా విడగొట్టారు. ఆయా పనులను తమకు అస్మదీయులైన కాంట్రాక్టర్లకు అప్పగించేశారు. వాస్తవానికి స్టాండింగ్ కమిటీలో ఆమోదం పొందిన తర్వాతే పనులను కాంట్రాక్టర్‌కు అప్పగించాలి. కానీ మ్యూజియం పనుల విషయంలో అలా జరగకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ముందుగా పనులు ప్రారంభించేసి, తర్వాత ఈ నెల ఏడున జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో కొన్ని అంశాలను ఆమోదించారు. ఈనెల 20న జరిగే స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఆమోదానికి మరికొన్ని అంశాలను ప్రతిపాదించారు. పనులకు పరిపాలనా ఆమోదం లభించకుండానే సోమవారం మ్యూజియాన్ని పునఃప్రారంభిస్తున్నట్టు జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ ప్రకటించారు. పనులు పూర్తి చేసిన తర్వాత స్టాండింగ్ కమిటీ ఆమోదానికి ప్రతిపాదించారా?, లేకపోతే పనులు పూర్తవకుండానే మ్యూజియాన్ని పునఃప్రారంభిచేస్తున్నారా?...అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. టెండర్ల ద్వారా పనులు కేటాయించినట్టయితే కాంట్రాక్టర్ల మధ్య పోటీ పెరిగి తక్కువకు కోట్ చేస్తారని, దీనివల్ల జీవీఎంసీకి చాలావరకూ డబ్బులు మిగులుతాయని కాంట్రాక్టర్లు పేర్కొంటున్నారు. కానీ పాలకవర్గంలోని పెద్దల ఒత్తిడి వల్లనో...అధికారుల ప్రత్యేక ఆసక్తితోనో అస్మదీయులైన కాంట్రాక్టర్లతో పనులు చేయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్ని పనులను అధికారులే బినామీల పేరుతో చేస్తున్నారని కాంట్రాక్టర్లు ఆరోపిస్తున్నారు. గతంలో జీ-20 సదస్సు సందర్భంగా అధికారులు ఇదే మాదిరిగా వ్యవహరించారని, టెండర్లు తెరవకుండానే బినామీల పేరుతో కొన్ని పనులను చేయించేసి, ఆ పనులకు ఇతరులెవరూ బిడ్ వేయకుండా అడ్డుకున్నారని గుర్తుచేస్తున్నారు. మ్యూజియం మరమ్మతుల విషయంలో భారీగా అక్రమాలు జరిగాయని, దీనిపై విజిలెన్స్, ఏసీబీ అధికారులు దృష్టి సారిస్తే వాస్తవాలు బయటపడతాయని పేర్కొంటున్నారు.

మత సామరస్యం శాంతికి పునాది

సీతమ్మధార, ఫిబ్రవరి 18 : మత సామరస్యమే ప్రపంచ శాంతికి పునాదని గా బీవీ ఫౌండేషన్ ఫర్ పీస్ అండ్ హార్మోనీ, ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రిలీజియస్ ఫ్రీడమ్ సంస్థ చైర్మన్ నరవ ప్రకాశరావు అన్నారు. లంకపల్లి బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్ సెమినార్ హాల్లో ఆదివారం ప్రపంచశాంతికి కళలు, సంస్కృతి పాత్ర అంశంపై సదస్సు నిర్వహించారు. ముందుగా ప్రకాశరావు, ఆచార్య జార్జ్ విక్టర్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఐక్యరాజ్య సమితి సూచనల మేరకు ఏటా ఫిబ్రవరిలో మత సామరస్య వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. విక్టర్ మాట్లాడుతూ బాల్య దశలోనే విద్యార్థుల్లో శాంతి సామరస్యంపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో హర గోపాలరావు, హుస్సేన్, చాట్లా బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌బీఎంయూపీ పాఠశాలకు మూడు ఎఫ్‌ఎల్ఐపీ ప్యానల్

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 18: జీవీఎంసీ 31వ వార్డు ఆర్‌బీఎంయూపీ పాఠశాలకు మూడు ఎఫ్‌ఎల్ఐపీ ప్యానల్ మంజూరయ్యాయని ప్రధానోపాధ్యాయుడు హెచ్.ప్రభాకర్ తెలిపారు. డిజిటల్ తరగతులు జరుగుతున్న నేపథ్యంలో డీఈవోకు విద్యార్థుల సంఖ్యను తెలయజేయడంతో వీటిని మంజూరు చేశారన్నారు. దీనివల్ల మరింత సులభంగా పాఠశాలను బోధించేందుకు అవకాశం కలుగుతుందన్నారు. ఉపాధ్యాయులు ఎస్.కనకరాజు, కె.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆకతాయిల చేష్టలతో విగ్రహానికి నష్టం

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 18: జీవీఎంసీ 31వ వార్డు ఆర్‌బీఎంయూపీ పాఠశాలలోని ప్రధాన ద్వారం వద్ద ఏర్పాటు చేసిన సరస్వతీదేవి విగ్రహం వెనుక అలంకరణ విరిగి పడిపోయింది. ఇది ఆకతాయిల పనేనని పాఠశాల సిబ్బంది చెబుతున్నారు. పాఠశాలకు వ్యాచ్‌మన్ లేకపోవడం కూడా కారణమని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి విగ్రహానికి మెరుగులుదిద్దాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.



సరస్వతీదేవి విగ్రహం వెనుక విరిగిన దిమ్మ

22, 23 తేదీల్లో జాతీయ సదస్సు


సదస్సు బ్రోచర్ విడుదల చేస్తున్న కళాశాల సిబ్బంది

జ్ఞానాపురం, ఫిబ్రవరి 18: స్థానిక సెయింట్ జోసఫ్ మహిళా కళాశాలలో ఈనెల 22, 23 తేదీల్లో వృక్షశాస్త్ర విభాగం, ఐక్యూఏసీ సహకారంతో జాతీయ సదస్సు నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ తెలిపారు. ఈ మేరకు కళాశాలలో ఆదివారం బ్రోచర్‌ను ఆవిష్కరించారు. వృక్షశాస్త్రంలో ఆవిష్కరణలు, అభివృద్ధి చెందుతున్న సాంకేతికత ఈ సదుస్సులో ముఖ్యఅంశం అని ఆమె తెలిపారు.వ్యవసాయం,బయోటెక్నాలజీ,హెర్బల్ టెక్నాలజీ,ఫార్మసీ,బయోడైవర్సిటీ కన్సర్వేషన్ మరియు క్లైమెట్ చేంజ్ రెసిలెన్స్ ఉపశమనాలు,గ్రీన్ టెక్నాలజీస్ వంటి ఆరు ఇతి వృత్తాలతో ఈసదస్సు జరుగుతుందని కన్వీనర్ డాక్టర్ కె.మాణిక్యకుమారి తెలిపారు.ఈకార్యక్రమంలో నిర్వాహక కమిటీ సభ్యులు డాక్టర్ పద్మ సుందరి,సిస్టర్‌హేమ,డాక్టర్ నాగరాజు,డాక్టర్ పికే జయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

మంచి బుద్ధితో మెలగండి: సీఐ


కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ విజయ్‌కుమార్

సీతంపేట, ఫిబ్రవరి 18 : ప్రతి ఒక్కరూ మంచి బుద్ధితో మెలగాలని, చట్ట వ్యతిరేక పనులకు పాల్పడితే చర్యలు తప్పవని నాలుగో పట్టణ సీఐ విజయ్‌కుమార్ హెచ్చరించారు. ఆదివారం ఆయన స్టేషన్ పరిధిలోని రౌడీ సీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఎక్కడ చిన్న గొడవ చేసినా చట్టపరమైన చర్యలతో పాటు జరిమానా విధిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతోనే నాయకత్వ లక్షణాలు


సమావేశంలో పాల్గొన్న ప్రతినిదులు

మహారాణిపేట, ఫిబ్రవరి 18: సమాజానికి సేవ చేయాలని భావించే వారికి అన్ని విషయాలపై కనీస అవగాహన ఉండాలని, అప్పుడే నాయకత్వ లక్షణాలు అలవడతాయని విశాఖ జేసీఐ జోన్ 4 మెంటార్ కేవీ రావు అన్నారు. మహారాణిపేటలో హోటల్ రాక్‌డేల్‌లో ఆదివారం విశాఖ వ్యాలీ జేసీఐ అచీవర్స్ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కారం, నాయకత్వ లక్షణాలు తదితర అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో కేవీ రావు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ అలవరచుకోవాలన్నారు. ప్రజా సమస్యలతో పాటు ఇతర అంశాలపై అవగాహన ఉంటే సమస్యల సత్వర పరిష్కారానికి అవకాశం ఉంటుందని, ప్రతి ఒక్కరికి ఆదర్శంగా నిలుస్తారనిన్నారు. ఈ సందర్భంగా ఇంద్రజా శంకు మాట్లాడుతూ అన్ని రంగాలలో ముందుకు సాగుతున్న మహిళలు సమాజంపై అవగాహన పెంచుకుని, నిర్భయంగా ఎదగాలని అన్నారు. సమావేశంలో దిలీప్‌కుమార్, రామరాజు, తదితరులు పాల్గొన్నారు.

'శంఖారావం సభకు తరలిరండి'

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 18 : బిర్లా జంక్షన్‌లో సోమవారం జరిగే శంఖారావం సభకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని ఆ పార్టీ రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షుడు, రాష్ట్ర కార్యాలయ కోఆర్డినేటర్ తమ్మినేని మోహనరావు పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన ప్రకటన విడుదల చేశారు.

యూసీసీ టీ20 క్రికెట్ చాంపియన్ గెలాక్సీ సీసీ



గెలాక్సీ జట్టుకు ట్రోఫీ అందిస్తున్న గోపీనాథ్‌రెడ్డి

విశాఖపట్నం (స్పోర్ట్సు), ఫిబ్రవరి 18 : వాల్తేరు రైల్వే గ్రౌండ్‌లో జరిగిన 10వ యూసీసీ టీ20 క్రికెట్ టోర్నీలో గెలాక్సీ సీసీ చాంపియన్‌గా నిలిచింది. డిఫెండింగ్ చాంప్ కవలియర్స్ రన్నరప్ స్థానంతో సరిపెట్టుకుంది. ఆదివారం జరిగిన ఫైనల్స్‌లో గెలాక్సీ సీసీ 54 పరుగుల తేడాతో కవిలియర్స్ సీసీపై విజయం సాధించి ట్రోఫీ కైవసం చేసుకుంది. ప్రశాంత్ (43), పాండురంగరాజు (21), పైలా అవినాష్ (33), ధీరజ్ లక్ష్మణ్ (26) రాణించారు. కవలియర్స్ బౌలర్లలో విపిన్ సింగ్ మూడు, భువనేశ్వర్ రెండు వికెట్లు పడగొట్టారు. లక్ష్య ఛేదనలో కవలియర్స్ సీసీ 18.5 ఓవర్లలో 114 పరుగులకు ఆలౌటై ఓటమి చెందింది. పృథ్వీరాజ్ (28) మినహా మిగిలిన వారు వికెట్ల ముందు నిలదొక్కుకోలేకపోయారు. గెలాక్సీ బౌలర్లలో పైలా అవినాష్ మూడు వికెట్లు పడగొట్టగా యశ్వంత్, కమిల్, సందీప్ తలో రెండు వికెట్లు తీశారు. టోర్నీ ముగింపు కార్యక్రమానికి ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) కార్యదర్శి ఎస్ఆర్. గోపీనాథ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విన్నర్స్‌కు ట్రోఫీ, నగదు బహుమతి అందించగా, ఆంధ్ర రంజీ టీం సెలక్షన్ కమిటీ ఛైర్మన్ ఆర్‌వీసీహెచ్.ప్రసాద్ (కిన్ను) ప్రత్యేక అతిథిగా హాజరై రన్నరప్ జట్టుకు ట్రోఫీ, నగదు బహుమతి అందించారు. ఈ కార్యక్రమంలో యూసీసీ అధ్యక్ష కార్యదర్శులు సీవీఆర్ మూర్తి, వై. వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌కే బీచ్‌లో న్యాయవాదుల నిరసన ప్రదర్శన


ఆర్‌కే బీచ్ వద్ద నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న న్యాయవాదులు

విశాఖపట్నం(లీగల్), ఫిబ్రవరి 18: ఏపీ టైటిల్ యాక్ట్ -22 ను రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ న్యాయవాదులు ఆదివారం ఆర్‌కే బీచ్‌లో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం కన్వీనర్ బెవర సత్యనారాయణ, అధ్యక్షుడు చింతపల్లి రాంబాబు మాట్లాడుతూ ఏపీ టైటిల్ యాక్ట్ -22ను తక్షణమే రద్దు చేయాలని కోరారు. అప్పటివరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామన్నారు. ఉపాధ్యక్షులు లత, కార్యదర్శి పైలా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. న్యాయవాదుల నిరసన ప్రదర్శన ఆర్‌కే బీచ్ వద్ద ప్రారంభమై వైఎంసీఏ వరకు సాగింది.

ఆకట్టుకున్న విద్యార్థుల నృత్య ప్రదర్శన


విద్యార్థినుల నృత్య ప్రదర్శన

కంచరపాలెం, ఫిబ్రవరి 18 : విద్యార్థుల్లో దాగి ఉన్న అంతర్గత నైపుణ్యాలను ఉపాధ్యాయులు వెలుగులోకి తీసుకురావాలని యల్లా ప్రగడ శ్రీధర్ అన్నారు. కంచరపాలెం దుర్గానగర్‌లో ఉన్న బీవీకే పాఠశాల వార్షికోత్సవంలో ఆదివారం ఆయన మాట్లాడారు. చిన్నారుల్లో ప్రతిభాపాటవాలను గుర్తించి వారిని ప్రోత్సహించాలని సూచించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఈ కార్య క్రమంలో పాఠశాల కరస్పాండెండెంట్ బీజేఎం రవికుమార్, ప్రిన్సిపాల్ వాగ్దేవు మహాలక్ష్మి పాల్గొన్నారు.

'ఫొటో జర్నలిస్టుపై దాడి హేయం'

విశాఖపట్నం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): వైసీపీ రాప్తాడులో నిర్వహించిన సిద్ధం సభలో 'ఆంధ్రజ్యోతి' ఫొటో జర్నలిస్టుపై దాడి చేయడం పత్రికా స్వేచ్ఛకు గొడ్డలిపెట్టు వంటిదని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ నజీర్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటనను విడుదల చేశారు. పత్రికా స్వేచ్ఛను కాపాడాల్సిన బాధత్య ప్రభుత్వం, యంత్రాంగంపై ఉందని, సాక్షాత్తూ సీఎం హాజరైన సభ వద్దే వైసీపీ నేతలు దాడులకు పాల్పడడం దారుణమన్నారు.

జగన్‌ను కీర్తించడానికి అంబేడ్కర్‌ను అవమానిస్తారా?

సిరిపురం, ఫిబ్రవరి 18 : జగన్‌ను కీర్తించడానికి అంబేడ్కర్‌ను అవమానిస్తారా అని విదసం రాష్ట్ర కన్వీనర్ బూసి వెంకటరావు ప్రశ్నించారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అంబేడ్కర్‌ను అవమానించినా వైసీపీలో ఉన్న దళితులకు ఆత్మగౌరవం గుర్తుకురాదన్నారు. పైగా విదేశీ విద్యా పథకానికి అంబేడ్కర్ పేరు తీసి జగన్ పేరు పెట్టినా సమ్మతమే అని జూపూడి ప్రకటించడం దళిత జాతిని జగన్‌కు తాకట్టు పెట్టడమేనన్నారు. అంబేడ్కర్ పేరు తీసి జగన్ పేరు పెట్టడాన్ని రాష్ట్రంలోని దళిత జాతి ఖండించిందన్నారు. జూపూడి సలహాదారు పదవి కోసం అంబేడ్కర్ పేరును తాకట్టు పెట్టడం జాతి అంగీకరించదన్నారు. తమకు డబ్బు కాదని అంబేడ్కర్ ఆశయం ముఖ్యమని చెప్పారు.

గ్రంథాలయాలకు తగ్గుతున్న ఆదరణ


రామారావును సత్కరిస్తున్న నిర్వాహకులు

సీతంపేట, ఫిబ్రవరి 18 : డిజిటల్, ఎలక్ట్రానిక్ బుక్స్, సెల్‌ఫోన్ల ప్రభావం తో గ్రంథాలయాలకు ఆదరణ తగ్గుతుందని నాగార్జున యూనివర్సిటీ మాజీ వీసీ బాల మోహన్‌దాస్ అన్నారు. ద్వారకానగర్‌లోని పౌర గ్రంథాలయంలో విద్యావేత్త, గ్రంథాలయాల వ్యవస్థాపకుడు వెలగ వెంకటప్పయ్య పేరుతో అవార్డులు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాల విశిష్టతను, యువత వాటిని ఏ విధంగా వినియోగించుకోవాలో వివరించారు. అనంతరం లైబ్రేరియన్ రామారావును నిర్వాహకులు సన్మానించారు. అలాగే లైబ్రేరియన్ కోటేశ్వరరావు గ్రంథాలయాలపై రాసిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. సొసైటీ ఫర్ ప్రమోషన్ ఆఫ్ పబ్లిక్ లైబ్రరీస్ అధ్యక్షుడు బీఎస్ఎన్ మూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విశాఖ జిల్లా లైబ్రేరియన్ వెంకటరావు, ప్రొఫెసర్ ఎస్. సాంబశివరావు. విశ్రాంత లైబ్రేరియన్, మురళీధర్‌రావు, కోటేశ్వరావు, తదితరులు పాల్గొన్నారు.

కబ్జా చేసిన భూములు చూపిస్తే రాసిస్తా

- భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

సీతమ్మధార, ఫిబ్రవరి 18: తాను భీమిలిలో భూముల కబ్జాకు పాల్పడినట్టు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఆరోపించారని, ఆ భూములు చూపిస్తే అతనికే రాసిస్తానని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. సీతమ్మధారలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ భూకబ్జాలకు పాల్పడింది టీడీపీ నేతలేనన్నారు. దళితుడుకి రాజ్యసభ సీటు ఇచ్చిన గొప్ప చరిత్ర సీఎం జగన్‌దేనన్నారు. లోకేశ్‌కు ధైర్యం ఉంటే భీమిలిలో పోటీ చేయాలని సవాల్ చేశారు.

'కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి'

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 18 : కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నామని ఏపీ టెక్నాలజీస్ మాజీ చైర్మన్ కొయ్యా ప్రసాద్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఎన్‌జీజీఓస్ కాలనీలో ప్రముఖ వ్యాపారవేత్త రాజులపల్లి శ్రీనివాసరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆధ్వర్యంలో పార్టీ ముందుకు సాగుతుందని, రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

విశాలాక్షినగర్, ఫిబ్రవరి 18 : కైలాసగిరి కొండపై ఉన్న తెలుగు మ్యూజియం 11 కేవీ ఫీడర్ నిర్వహణ పనుల్లో భాగంగా సోమవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏఈ రాజేష్ తెలిపారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జోడుగుళ్లపాలెం, దయాల్‌నగర్, కో-ఆపరేటివ్ లే అవుట్, ఎస్సీ, ఎస్టీ కాలనీ, పోలీసు పెట్రోల్ బంక్, కైలాసగిరి రోడ్డు ప్రాంతాలకు సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

సందర్శకులతో జూ కిటకిట

ఆరిలోవ, ఫిబ్రవరి 18 : నగరంలోని ఇందిరాగాంధీ జంతు ప్రదర్శన శాల సందర్శకులతో ఆదివా రం కిటకిటలాడింది. 2850 మంది పర్యాటకులు జూను సందర్శించగా వారి నుంచి సుమారు రూ. 2.34 లక్షల మేర ఆదాయం సమకూరినట్టు జూ క్యూరేటర్ డాక్టర్ నందనీ సలారియా తెలిపారు.

నేడు రామాలయం ప్రారంభోత్సవం

మధురవాడ, ఫిబ్రవరి 18 : జీవీఎంసీ ఏడో వార్డు పిల కవానిపాలెంలో కొత్తగా నిర్మించిన రామాలయాన్ని సోమవారం ప్రారంభించనున్నారు.ఈసందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే మంగళవారం ఏకాదశి సందర్భంగా గణపతి పూజ, గవ్యాంతమార్జనలు, ధాన్యాదివాసం, హోమం, శిఖర ప్రతిష్ఠ జరుగుతాయి. బుధవారం ద్వాదశి కావడంతో ప్రత్యేక పూజలు, సీతారాముల విగ్రహాల ప్రతిష్ఠ, మధ్యాహ్నం అన్న సమారాధన, సాయంత్రం 4 గంటలకు సీతారాముల కల్యాణం జరగనున్నాయి.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మధురవాడ, ఫిబ్రవరి 18 : జీవీఎంసీ ఏడో వార్డులోని పలు ప్రాంతాల్లో రూ. 58 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు వార్డు కార్పొరేటర్ పిళ్లా మంగమ్మతో కలిసి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిధులతో భరత్‌నగర్, కళానగర్‌లో సీసీ రోడ్లు, కాలువలు నిర్మించనున్నట్టు చెప్పారు. అలాగే మిథిలాపురి వుడాకాలనీలో సామాజిక భవనం నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు.

ఘనంగా మరిడిమాంబ విగ్రహ ప్రతిష్ఠ

విశాలాక్షినగర్, ఫిబ్రవరి 18 : జీవీఎంసీ 9 వార్డు సీత కొండ వ్యూపాయింట్ కొండ దిగువన ఉన్న ఆలయంలో మరిడిమాంబ అమ్మవారి విగ్రహప్రతిష్ఠ ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు.కార్యక్రమంలో ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, కార్పొరేటర్ స్వాతిదాస్, జోడుగుళ్లపాలెం గ్రామ కమిటీ సభ్యులు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

అలరించిన శాస్త్రీయ నృత్యాలు



కళాకారుల నృత్య ప్రదర్శన

మధురవాడ, ఫిబ్రవరి 18 : వారాంతపు వినోద కార్యక్రమాల్లో భాగంగా శిల్పారామంలో నగరానికి చెందిన జోష్ డ్యాన్స్ ఆకాడమీ కళాకారులు ఆదివారం శాస్త్రీయ నృత్యాలు ప్రదర్శించారు. పలు కీర్తనలకు కళాకారులు కుషల్, శ్రవంతి, సంధ్య, సాన్వీ నృత్యరీతులు సమకూర్చారు.

నేడు స్పందన

భీమునిపట్నం, ఫిబ్రవరి 18 : పట్టణంలోని జోనల్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం జరగనుంది. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ జరిగే ఈ కార్యక్రమాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జోనల్ కమిషనరు కనకమహాలక్ష్మి కోరారు.

అన్నవరంలో ఆధ్యాత్మిక ప్రచారం

భీమునిపట్నం (రూరల్), ఫిబ్రవరి 18 : మండలంలోని అన్నవరం గ్రామంలో ప్రభోద సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఆధ్యాత్మిక ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు మాఘ పౌర్ణమి ప్రత్యేకతను గ్రామస్తులకు వివరించారు.ఈ కార్యక్రమంలో సభ్యులు క్షేత్రినాథ్ రావు, సురేష్, భవాని, రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **ఊరు పేరు భైరవకోన :** మెలోడి, సంగం, కామేశ్వరి, గోకుల్, శ్రీకన్య, ఊర్వశి, నరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), కన్య-2 (గాజువాక), దుర్గ (మధురవాడ), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)
- **ఈగల్ :** జగదాంబ, శరత్, రమాదేవి, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), నటరాజ్ (పెందుర్తి), గణేష్ (తగరపువలస)
- **అంబాజీపేట మ్యారేజి బ్యాండు :** సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), లక్ష్మి (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **కెప్టెన్ మిల్లర్ :** వెంకటేశ్వర
- **హనుమాన్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీరామ, శారద, గోకుల్, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్ (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
- **గుంటూరు కారం :** లీలామహల్, సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 20,టమాటా 18, వంకాయలు (తెలుపు) 34, వంకాయలు (నలుపు) 60, బెండకాయలు 50, పచ్చిమిర్చి 38, కాకరకాయలు 44, బీరకాయలు 46, ఆనపకాయలు 16, కాలీఫ్లవర్ 22, క్యాబేజ్ 22, క్యారేట్ 24, దొండకాయలు 40, బంగాళా దుంపలు 17, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 74, అల్లం (పాతది) 106, బరబటి 28, ముల్లంగి 16, నిమ్మకాయలు (కిలో) 110, గోరుచిక్కుడు 40, దోస కాయలు 28, వెల్లుల్లి (పెద్దవి) 280, కొబ్బరికాయ (పెద్దది) 22, బీన్స్ (పెన్సిల్) 44, ఆగాకర 52, పొటల్స్ 62, కీరదోస 32, కాప్సికమ్ 55, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 52, చిలగడదుంపలు 30 , కంద 60, దేముడు చిక్కుడు 40, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 24, మామిడి అల్లం 60, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	115
ఫారం ధర	--	135
విత్ స్కిన్	--	240
స్కిన్‌లెస్	--	250

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెలగపూడి



మహిళా నేతలతో నారా లోకేశ్, వెలగపూడి



మాట్లాడుతున్న వంశీకృష్ణ శ్రీనివాస్

వైసీపీ అరాచకాలపై యుద్ధం

- నాయకులు, కార్యకర్తలు సిద్ధం కావాలి
- తూర్పు శంఖారావం సభలో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 18 : నగరంలో వైసీపీ అరాచకాలకు అడ్డూఅదుపు లేదని తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అన్నారు. ఆదివారం ఎంవీపీ కాలనీలోని అప్పుఘర్ వద్ద జరిగిన శంఖారావం సభలో ఆయన మాట్లాడారు. ప్రశాంతమైన నగరాన్ని వైసీపీ ప్రభుత్వం వచ్చాక గంజాయిమయంగా చేసిందన్నారు. రుషికొండకు గుండు కొట్టించి రూ. 500 కోట్ల ప్రజా ధనంతో జగన్ ప్యాలెస్ కట్టుకున్నారని తెలిపారు. నగరంలో వైసీపీ నేతల భూ ఆక్రమణలు హెచ్చుమీరుతున్నాయని, వాటిపై ఎప్పటికప్పుడు న్యాయ పోరాటం చేస్తున్నామని తెలిపారు. హుద్‌హుద్ తుపాను సమయంలో చంద్రబాబు ఇక్కడ అందించిన సేవలు అనిర్వచనీయమని, అందుకే గత ఎన్నికల్లో నగరంలోని నాలుగు స్థానాల్లోనూ టీడీపీ గెలిచిందన్నారు. టీడీపీ, జనసేన కార్యకర్తలను ఇబ్బంది పెడుతున్న అధికారుల పేర్లు రెడ్‌బుక్‌లో రాసి శిక్షించాలని కోరారు. సింహాచలం భూములకు సంబంధించి 229 జీవోను టీడీపీ-జనసేన ప్రభుత్వం వచ్చాక అమలు చేయాలని కోరారు.

జనసేన నగర అధ్యక్షుడు వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ రుషికొండ బీచ్‌ను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైన ఉందన్నారు. అన్ని వసతులు ఉన్న విశాఖను ఐటీ హబ్‌గా తీర్చిదిద్దాలని కోరారు. రెడ్ బుక్‌లో కేవలం అధికారుల పేర్లు మాత్రమే కాకుండా రాజకీయ నాయకుల పేర్లు కూడా చేర్చాలన్నారు.

లోకేశ్‌కు వినతి

టూరిస్టు బస్సు, కాంట్రాక్టు క్యారియర్ యజమానులను ఆదుకోవాలని ఉత్తరాంధ్ర టూరిస్టు బస్సు ఓనర్స్ అండ్ కాంట్రాక్టు కేరియర్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు లోకేశ్‌కు విజ్ఞప్తి చేశారు. వైసీపీ వచ్చాక గత ఉమ్మడి జిల్లాలను రెండు మూడు జిల్లాలుగా విభజించి ప్రతి జిల్లాకు ట్యాక్స్ కట్టాలని జీఓ ఇచ్చారని గతంలో ప్రతి సీటుకు వెయ్యి రూపాయలు చెల్లిస్తే, ప్రస్తుతం రూ.1510 కట్టాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై లోకేశ్ స్పందిస్తూ రాబోయే ప్రజా ప్రభుత్వంలో తక్కువ పన్నులు ఉండేలా చూస్తామన్నారు.



చెక్కతో చంద్రబాబు ముఖచిత్రాన్ని తయారు చేసిన ఫొటోను లోకేశ్‌కు అందిస్తున్న కార్పెంటర్ సన్యాసిరావు

కళాకారుడికి అభినందనలు

ఎంవీపీ కాలనీ : చెక్కతో చిత్రాలు రూపొందించే కళాకారుడ్ని లోకేశ్ అభినందించారు. శంఖారావం సభలో కార్పెంటర్ సన్యాసిరావు తాను తయారు చేసిన చంద్రబాబు చిత్రాన్ని ఫొటోగా కట్టి, లోకేశ్‌కు బహూకరించారు. ఆయన కళా ప్రతిభను చూసి లోకేశ్ అభినందించారు. తాను మహనీయుల చిత్రాలను చెక్కతో తయారు చేస్తున్నానని, చంద్రబాబుపై ఉన్న అభిమానంతో ఆయన ముఖ చిత్రాన్ని చెక్కినట్టు సన్యాసిరావు తెలిపారు.



సభలో నాయకులు, కార్యకర్తల ఆనందం



పెయింట్లు లేకుండా ఉన్న భవనాలు



పాఠశాల భవనంలో నిర్మాణ సామగ్రి

కుర్రపల్లిలో అసంపూర్తిగా నాడు - నేడు పనులు

- పాఠశాలలో కనీస సౌకర్యాలు లేక విద్యార్థుల అవస్థలు
- వసతి లేమితో వరండాలో బోధన
- అపరిశుభ్రత మధ్య వంట షెడ్

పద్మనాభం, ఫిబ్రవరి 18 : పాఠశాలలకు నాడు - నేడు పథకం ద్వారా నిధులు మంజూరు చేసి మౌలిక వసతులు కల్పిస్తున్నామని, ప్రైవేటుకు దీటుగా విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యను అందిస్తున్నామని చెబుతున్న పాలకుల మాటలు నీటి మీద రాతలే అవుతున్నాయి. గత ఏడాది నాడు-నేడు కోసం ఎంపిక చేసిన పాఠశాలల్లో నేటికీ ఆ పనులు పూర్తికాక విద్యార్థులు అసౌకర్యాల నడుమ చదువుతున్నారు. ఇందుకు మండలంలోని కుర్రపల్లి పాఠశాలలో దుస్థితే నిదర్శనం. ఈపాఠశాలలో చేపట్టిన రెండో విడత నాడు-నేడు పనులు అసంపూర్తిగా ఉండడంతో విద్యార్థులు అసౌకర్యానికి గురవుతున్నారు.పాఠశాలకు రెండో విడత నాడు-నేడు పనుల కోసం రూ. 11 లక్షలు మంజూరయ్యాయి. వీటితో ఇప్పటివరకు ఆర్ఓ ప్లాంటు ద్వారా తాగునీటి సదుపాయం, రెండు భవనాలకు శ్లాబు మరమ్మతులు, లీకేజీ లేకుండా కెమికల్ ప్లాస్టరింగు, భవనం వరండా భాగంలో పిట్ట గోడ నిర్మించి ఇనుప గేట్ల అమరిక, విద్యుదీకరణ వంటి కొన్ని పనులు చేపట్టారు. బాలికలకు టాయిలెట్లు నిర్మించగా, బాలురకు మరుగుదొడ్ల నిర్మాణం నేటికీ చేపట్టలేదు. పెయింట్లు కూడా వేయక పోవడంతో భవనాలు అంధవికారంగా కనిపిస్తున్నాయి. నిర్మాణ సామగ్రిని భవనం లోపల పెట్టడంతో విద్యార్థులు వరండాలో కింద కూర్చొని చదవాల్సి వస్తోంది. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఫర్నీచరు కూడా సమకూర్చాల్సి ఉంది. గ్రీన్ చాక్ బోర్డులు, ఐఎఫ్‌పీ పానల్ బోర్డుల ద్వారా ఇంగ్లీష్ ల్యాబ్ ఏర్పాటు చేయాల్సి ఉంది. పాఠశాలకు ప్రహరీ కూడా లేకపోవడంతో పరిసర ప్రాంతంలో ఉన్న వారు ఆవరణాన్ని పాడుచేస్తున్నారు. దీంతో విద్యార్థులు అపరిశుభ్రత నడుమ అభ్యసనకు ఇబ్బంది పడుతున్నారు. వంటషెడ్ వద్ద కూడా ఆరోగ్యకరమైన వాతావరణం లేదు.నిర్వాహకులు ఆరుబయట కట్టెల పొయ్యిపై వంట చేస్తున్నారు. ఈవిషయమై వారిని ప్రశ్నించగా గ్యాస్ అయిపోయిందని బదులిచ్చారు.

కాగా నాడు-నేడు పనులు పూర్తికాకపోవడంపై పాఠశాల హెచ్ఎం శ్రావణిని వివరణ కోరగా నిధులు పూర్తిగా రాకపోవడంతో కొన్ని పనులు చేపట్టాల్సి ఉందన్నారు. సెంటర్ ఇండెంట్ ప్రకారం జిల్లా కేంద్రం నుంచి కొంత సామగ్రి కూడా రావాల్సి ఉందని ఆమె చెప్పారు.



ఎటువంటి రక్షణ లేకుండా తవ్వి వదిలేసిన గోతులు

ప్రమాదకరంగా యూజీడీ గోతులు

ఆరిలోవ, ఫిబ్రవరి 18 : దీనదయాళపురం నుంచి పెదగదిలి జంక్షన్ వరకు ఏడు నెలలుగా యూజీడీ (అండర్ గ్రౌండ్ డ్రైనేజీ) పనులు జరుగుతున్నాయి. పనుల్లో భాగంగా శాలిపేట వద్ద గోతులు తవ్విన జీవీఎంసీ అధికారులు వాటి చుట్టూ ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టకుండా వదిలేయడంతో ప్రమాదకరంగా ఉన్నాయి. దీంతో అటువైపుగా రాకపోకలు సాగిస్తున్న వాహనదారులు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయపడుతున్నారు. వాస్తవానికి గోతుల చుట్టూ కర్రలు పాతి ఎరుపు రంగు గుడ్డలు కాని, టేప్‌లు కాని చుట్టాలి. కానీ అధికారులు అవేవీ చేయకుండా వదిలేశారు. దీంతో స్థానికులు రాకపోకలకు భయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గోతుల చుట్టూ భద్రతా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

సజీవ నాగరికతకు భారతదేశం విశ్వగురువు



సదస్సులో పాల్గొన్న డాక్టర్ వేమాదవ శాస్త్రి, ఇతర వక్తలు

ఎంవీపీ కాలనీ, ఫిబ్రవరి 18 : భారతదేశం సజీవమైన నాగరికతకు విశ్వగురువు అని డాక్టర్ వేమాదవ శాస్త్రి (డేవిడ్ ఫ్రాలీ) అన్నారు. ఎంవీపీ కాలనీలోని ఐఏఎం కళాశాలలో రీకన్‌స్ట్రక్టింగ్ ది కల్చరల్ హిస్టరీ ఆఫ్ భారత్ అన్న అంశంపై జరిగిన సదస్సులో ఆదివారం ఆయన మాట్లాడారు. భారత్ ప్రపంచ వ్యాప్తంగా ఎందరో పండితులకు, మేధావులకు, విద్యావేత్తలకు నిలయమని చెప్పారు.సద్గురు శివానందమూర్తి సంప్రదాయ సనాతన సంస్కృతిలో గొప్ప రుషి, యోగి అని కొనియాడారు. అనంతరం ప్రొఫెసర్ వై. సుదర్శనరావు సింపోజియం లక్ష్యాలను వివరించారు. శివానంద సుపథ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భారతీయ ఇతిహాస సంకలన యోజన ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ బల్ముకుంద్ పాండే, ప్రొఫెసర్ ఆర్. రాఘవేంద్ర, డాక్టర్ రేమెళ్ల అవధానులు, యోగిని శాంభవి, నీలేష్ నీలకంత్ ఓక్, డాక్టర్ కోయెన్‌రాడ్, తదితరులు పాల్గొన్నారు.

102 మందికి వైద్య పరీక్షలు



రోగులను పరీక్షిస్తున్న హోమియో వైద్యులు

భీమునిపట్నం, ఫిబ్రవరి 18 : పట్టణంలోని కలిగొట్ల స్నిగ్ధశ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. చిన్నబజారులోని డచ్ వీధిలో వున్న ఆ సంస్థ కార్యాలయంలో జరిగిన ఈ శిబిరంలో వైద్యులు 102 మందికి పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ చైర్మన్ కలిగొట్ల శ్రీరామచంద్రమూర్తి,హోమియో వైద్యులు టి. జగన్నాథరావు, టీజే మోహనరావు, ఫౌండేషన్ ప్రతినిధులు మూర్తి, చంద్రశేఖర్, భానోజీరావు, శ్రీనివాసరావు, పద్మజ, అనురాధ పాల్గొన్నారు.

సాగర్‌నగర్‌కు అరకొరగా బస్సు సర్వీసులు

సాగర్‌నగర్, ఫిబ్రవరి 18 : సాగర్‌నగర్ కాలనీ, పరిసర తీర ప్రాంతాలకు అరకొరగా బస్సు సర్వీసులు ఉండడంతో స్థానికులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లాలన్నా, అక్కడి నుంచి ఇక్కడికి రావాలన్నా బస్సుల కోసం గంటల తరబడి పడిగాపులు కాయాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు. సొంత వాహనాలు వున్న వారు మాత్రమే తీర ప్రాంతాల వైపు నివాసాలు ఉండగలిగే పరిస్థితులు నెలకొన్నాయి. సొంత వాహనాలు లేని వారు రాకపోకలకు నానా అవస్థలు పడాల్సి వస్తోంది. నగరం నుంచి సాగర్‌నగర్‌కు రావాలంటే హనుమంతువాక జంక్షన్, మద్దిలపాలెం బస్టాండ్, ఆర్టీసీ కాంప్లెక్స్, పూర్ణామార్కెట్ బస్టాప్‌ల వద్ద గంటల తరబడి పడిగాపులు కాయాల్సిన పరిస్థితి. పాలకులు, అధికారులు స్పందించి సాగర్‌నగర్‌కు తగినన్ని బస్సు సర్వీసులు నడపాలని పలువురు కోరుతున్నారు.

అప్పన్నకు వైభవంగా స్వర్ణ పుష్పార్చన



వేడుకలో పాల్గొన్న భక్తులు

సింహాచలం, ఫిబ్రవరి 18 : వరాహలక్ష్మీనృసింహస్వామికి స్వర్ణ పుష్పార్చన ఆదివారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠంప జేసి ఆలయ పద్మనిధి నుంచి స్వర్ణ సంపెంగలను తీసి భక్తులతో స్పృశింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నృసింహ అష్టోత్తర శత నామావళితో ప్రతి నామానికి ఒక్కొక్క బంగరు సంపెంగతో అర్చన చేశారు. మంత్ర పుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. అనంతరం అదే వేదికపై ఆర్జిత నిత్య కల్యాణం జరిపారు.

జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు విద్యార్థిని ఎంపిక



అనూషను అభినందిస్తున్న శ్రీనివాసరావు, విద్యాలయం సిబ్బంది

భీమునిపట్నం, ఫిబ్రవరి 18 : పట్టణంలోని కేజీబీవీలో పదో తరగతి చదువుతున్న మండల అనూష జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికైనట్టు విద్యాలయం ప్రిన్సిపాల్ గంగాకుమారి తెలిపారు. ఈమేరకు జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్టు ఆడిషినల్ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు బాలికను కేజీ బీవీలో ఆదివారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఎంతోమంది విద్యార్థులు మంచి ప్రతిభ కలిగి ఉన్నారని, అటువంటి వారిని ప్రోత్సహిస్తే మంచి ఫలితాలు వస్తాయని చెప్పారు. కార్యక్రమంలో జీసీడీఓ కరీసా బేగం, ఏజీ జీసీడీవో గీత, ఎఫ్ఏఓ భారతి, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉపాలయాల్లో తిరు కల్యాణోత్సవాలు

సింహాచలం, ఫిబ్రవరి 18 : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నడుస్తున్న అనుబంధ ఆలయాలు బాలసుందరి సహిత త్రిపురాంతకస్వామి, కొండదిగువ స్వామివారి పూదోటలోని పద్మావతి అలిమేల్‌మంగా సమేత వేంకటేశ్వరస్వామి, మాధవధారలోని కుంతీ మాధవస్వామి, రుక్మిణీ సమేత వేణుగోపాలస్వామివార్ల వార్షిక తిరుకల్యాణోత్సవాలకు సోమవారం నుంచి శ్రీకారం చుట్టనున్నారు. ఏటా మాఘమాస శుక్ల పక్ష దశమిన అంకురార్పణంతో వార్షిక కల్యాణోత్స వాలను ప్రారంభించి, పూర్ణిమ నాటి అవబృదోత్సవము వరకు జరపడం ఆనవాయితీ. ఈమేరకు మంగళవారం నుంచి అనుబంధ ఆలయాల్లో ఉత్సవాలు ప్రారంభమై ఈనెల 24 వరకు కొనసాగనున్నాయి. ఇందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

వినాయక విగ్రహం ప్రతిష్ఠకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న విగ్రహ దాతలు, ఆలయ ఈఓ గాయత్రి

పెదవాల్తేరు, ఫిబ్రవరి 18 : కరకచెట్టు పోలమాంబ ఆలయం ఎదురుగా రాజగోపురం షాపుల మధ్య వినాయక విగ్రహం ప్రతిష్ఠించనున్నట్టు ఆలయ ఈఓ కె. గాయత్రి తెలిపారు. ఆదివారం విగ్రహం దాతలు రెడ్డి కన్వెన్షన్ అధినేత యంపాడ రాజేశ్వరరెడ్డి, ఆయన కుమారుడు ప్రసాద్‌రెడ్డి, ఈవో గాయత్రి, చైర్మన్ పి. శంకర్‌రెడ్డి పోలమాంబ ఆలయం ఆవరణలో వినాయక విగ్రహం ప్రతి ష్ఠకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఆలయం ధర్మకర్తల మండలి సభ్యులు మాదు మంగరాజు, నందూరి కృష్ణమోహన్, నీలపు పైటమ్మ, గొంప సంతోష్, మారడ నాగమణి, మారెడ్ల సత్య వెంకట రమణమ్మ, బుడుమూరి భారతి, పెదవాల్తేరు గ్రామ సేవా సంఘం సభ్యులు పి. నీలరెడ్డి, అర్చకులు, దేవాయం సిబ్బంది పాల్గొన్నారు.

నూకాలమ్మ ఉత్సవ కమిటీ ఏర్పాటు



నూతన కమిటీ సభ్యులు

భీమునిపట్నం,ఫిబ్రవరి 18 : పట్టణ ప్రజల గ్రామ దేవత నూకాలమ్మ తల్లి ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా గిడుతూరి శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం అమ్మవారి ఆలయం వద్ద కమి టీ సభ్యులు సమావేశమయ్యారు. గత ఏడాది కమిటీ అధ్యక్షుడు వాసుపల్లి ఎల్లాజీరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆ ఏడాది ఆదాయ, వ్యయాలను సభకు నివేదించారు. అనంతరం జరిగిన నూతన కమిటీ ఎన్నికలో అధ్యక్షుడిగా శ్రీను, ప్రధాన కార్యదర్శిగా పీరుపల్లి రాజు, కోశాధికారిగా రాకోతు నర్సింగరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా నాగిరెడ్డి స్వామి, కో ఆర్డినేటర్‌గా అప్పికొండ బాలకృష్ణను సభ్యులు ఎన్నుకున్నారు. ఏప్రిల్‌లో అమ్మవారి ఉత్సవం నిర్వహించనున్నట్టు నూతన కమిటీ తెలిపింది. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు గంటా నూకరాజు, అల్లిపిల్లి నర్సింగరావు, వాసుపల్లి కొండబాబు, కంటుభుక్త ముత్యాలరావు, మైలపల్లి లక్ష్మణావు, రాంభుక్త ప్రభాకరనాయుడు, ఆలయ పూజారి చౌదరి సత్యరాజు, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

అనంతుని ఆలయ అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు

పద్మనాభం, ఫిబ్రవరి 18 : పద్మనాభంలోని అనంత పద్మనాభుని దేవస్థానంలో ఎంపీ నిధులతో పలు అభివృద్ధి పనులు చేపట్టడానికి అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు విశ్రాంతి మందిరంతో పాటు ఇతర అభివృద్ధి పనులు రూ. 40 లక్షలతో చేపట్టడానికి అవరమైన ప్రతిపాదనలను పంచాయతీరాజ్‌శాఖ ఇంజనీరింగు అధికారులు రూపొందించగా ఈ నిధులను విశాఖ ఎంపీ తన అభివృద్ధి నిధుల నుంచి మంజూరు చేయడానికి ముందుకు వచ్చారు.

'ఎంపీ ఎంవీవీపై వ్యక్తిగత విమర్శలు సరికాదు'

విశాఖపట్నం, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : ఎంపీ ఎంవీవీ సత్యనారాయణను వ్యక్తిగతంగా విమర్శించే అర్హత, స్థాయి టీడీపీ తూర్పు నియోజకవర్గం మహిళా నేతలకు లేదని వైసీపీ మహిళానేతలు అన్నారు. ఆదివారం వారు లాసన్స్‌బే కాలనీలోని ఎంపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎంపీ రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకూ ఎవరినీ వ్యక్తిగతంగా విమర్శించలేదని, లక్షల మంది అభిమానంతో ఎంపీగా గెలిచిన వ్యక్తిపై టీడీపీ మహిళా నేత పల్లా ఉమారాణి తన స్థాయి మరిచి విమర్శలు చేయడం సరికాదన్నారు. ఎంపీ పైన, తూర్పు నియోజకవర్గం పరిశీలకుడు మొల్లి అప్పారావుపైన వ్యక్తిగత విమర్శలు చేస్తే ఇంటికి వచ్చి బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో గవర కార్పొరేషన్ డైరెక్టర్ పీలా జోషిలా, 16వార్డు మహిళా అధ్యక్షురాలు ఒమ్మి పోలరత్నం, వ్యవసాయ మార్కెటింగ్ మాజీ డైరెక్టర్ పిల్లా సత్యవతి, సింహాచలం బోర్డు మెంబర్ చందకరత్నం పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్‌పై దాడి హేయమైన చర్య

కొమ్మాది, ఫిబ్రవరి 18 : నిజాలను నిర్భయంగా రాసే జర్నలిస్టులపై దాడి చేయడం దుర్మార్గమైన చర్య అని టీడీపీ విశాఖ పార్లమెంట్ అధికార ప్రతినిధి దాసరి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అనంతపురం జిల్లా రాప్తాడులో నిర్వహించిన సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై వైసీపీ శ్రేణులు చేసిన దాడిని ఖండించారు. జర్నలిస్టులపై దాడులు సమర్థనీయం కాదని, మళ్లీ ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

'ఎంపీగా ఎంవీవీ విఫలం'

సిరిపురం, ఫిబ్రవరి 18 : ఎంపీ ఎంవీవీ సత్యనారాయణకు ఎమ్మెల్సీ వంశీకృష్ణయాదవ్‌ను విమర్శించడానికి లేచిన నోరు పార్లమెంట్‌లో విభజన హామీల కోసం మాట్లాడేందుకు లేచి ఉంటే బాగుండేదని కాంగ్రెస్ పార్టీ నాయకురాలు ప్రియాంక దండి అన్నారు. ఆదివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఎంపీగా ఎంవీవీ సత్యనారాయణ పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు.

అభివృద్ధిని చూసి లోకేశ్ మాట్లాడాలి : వైసీపీ

భీమునిపట్నం, ఫిబ్రవరి 18 : తగరపువలసలో జరిగిన శంఖారావం సభలో నారా లోకేశ్, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు చేసిన అభివృద్ధి తెలియక అసత్యాలు మాట్లాడారని వైసీపీ నాయకులు పేర్కొన్నారు. ఆదివారం వారు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. శంఖారావం సభకు జనం లేరని, ఎవరో రాసిన స్క్రిప్ట్ లోకేశ్ చదివేసారని, వాస్తవానికి ఆయనకు అవంతి శ్రీనివాసరావు చేసిన అభివృద్ధి తెలియదన్నారు. శిలాఫలకాలు వేసి పారిపోయేది టీడీపీ వారేనని, అటువంటి వాటికి కూడా నిధులు రప్పించి ఎమ్మెల్యే అభివృద్ధి చేశారని చెప్పారు. ఈ సమావేశంలో భీమిలి ఏఎంసీ చైర్మన్ ఎలమంచిలి సూర్యనారాయణ, ఆనందపురం మాజీ ఎంపీపీ కోరాడ వెంకటరావు, తగరపువలస నాయకుడు జగ్గుపల్లి ప్రసాద్, జీరు వెంకటరెడ్డి, ఎస్. కరుణాకర్‌రెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, అక్కరమాని రామునాయుడు, వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, బంక సత్యం, ఎల్లాజి పాల్గొన్నారు.



వాహనాల తనిఖీ చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు


గాజువాక, ఫిబ్రవరి 18: నిబంధనలను అతిక్రమించిన వాహనదారులపై పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై కఠిన చర్యలు చేపడుతున్నారు. మైనర్‌లు వాహనాలు నడిపినా, లైసెన్స్ లేకుండా, త్రిపుల్ రైడింగ్ చేసిన వారికి జరిమానా విధిస్తున్నారు. అదేవిధంగా ర్యాష్ డ్రైవింగ్ చేసిన వారిని పట్టుకుని చర్యలు తీసుకుంటున్నారు. ప్రతిఒక్కరూ తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, లేకుంటే తగిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

నేడు బీహెచ్‌పీవీ ప్రసన్నగిరి ప్రదక్షణ



అక్కిరెడ్డిపాలెం, ఫిబ్రవరి 18: ఏటా ఎంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే బీహెచ్‌పీవీ ప్రసన్నగిరి ప్రదక్షణ సోమవారం జరగనున్నది. భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని బీహెచ్‌పీవీ ప్రసన్నగిరిపై గల వేంకటేశ్వర వినాయకస్వామి దేవస్థానం వార్షికోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం ఆరు గంటలకు నిర్వహించే ప్రసన్నగిరి ప్రదక్షణలో స్వామివారి పల్లకీ ఊరేగింపుతో పాటు 108 కలశాలతో భక్తులు మూడుసార్లు కొండ చుట్టూ ప్రదక్షణలు చేయనున్నారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొననున్నందున వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పాలక మండలి సభ్యులు ఏర్పాట్లు చేశారు.

ఆదిత్యునికి ప్రత్యేక పూజలు



ఆటోనగర్, ఫిబ్రవరి 18: జీవీఎంసీ 70వ వార్డు పరిధి చట్టివానిపాలెంలోని శివాలయంలోని సూర్యభగవానునికి మాఘ ఆదివారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. ఆలయ ప్రధాన పూజారి కిషోర్‌శర్మ ఆధ్వర్యంలో పంచామృతాభిషేకాలు, నవగ్రహ పూజలు జరిపారు. అనంతరం స్వామివారిని పూలమాలతో అలంకరించారు. పలువురు భక్తులు నవగ్రహ స్తోత్రాలను, ఆదిత్య హృదయాన్ని పఠించారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో భాస్కరున్ని దర్శించుకోగా, నిర్వాహకులు ప్రసాదం పంపిణీ చేశారు.





గాజువాక లంకా మైదానంలో సిద్ధమవుతున్న సభా వేదిక.. పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న పల్లా శ్రీనివాసరావు

గాజువాకలో నేడే లోకేశ్ శంఖారావం సభ

గాజువాక, ఫిబ్రవరి 18: గాజువాక లంకా మైదానంలో సోమవారం తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి నారా లోకేశ్ శంఖారావ సభ జరగనున్నది. ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ సభను నిర్వహించేందుకు ఇప్పటికే పార్టీ శ్రేణులు ఏర్పాట్లు చేశారు. సోమవారం ఉదయం 11 గంటలకు సభ ప్రారంభం కానున్న నేపథ్యంలో వచ్చిన వారందరికీ భోజనాలు ఏర్పాటు చేసేందుకు తగిన చర్యలు చేపట్టారు. అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, ప్రజలు సభకు తరలి రానున్నందున వారికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పార్టీ శ్రేణులతో పాటు పోలీసులు కూడా చర్యలు తీసుకుంటున్నారు.

సభను సక్సెస్ చేయాలి

ఇక్కడి లంకా మైదానంలో సోమవారం జరగనున్న లోకేశ్ శంఖారావం సభకు అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, అన్ని వర్గాల ప్రజలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా టీడీపీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు కోరారు. ఇక్కడి

ఏర్పాట్లు పూర్తి చేసిన పార్టీ శ్రేణులు

కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

టీడీపీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గాజువాకలో అత్యంత వేడుకగా ఈ సభను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన విజయం తథ్యమని, సీఎం జగన్‌కు బుద్ధి చెప్పేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, నాయకులు నల్లూరు సూర్యనారాయణ, పులి వెంకటరమణారెడ్డి, మొల్లి పెంటిరాజు, గణపతి, తదితరులు పాల్గొన్నారు.

కూర్మన్నపాలెం: నారా లోకేశ్ శంఖారావం సభను నియోజకవర్గ ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాల్సిందిగా టీడీపీ 86వ వార్డు ఇన్‌ఛార్జి నల్లూరు సూర్యనారాయణ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వుడా నగర్‌లో ఆదివారం ఆయన ఇంటింటికీ వెళ్లి లోకేశ్ సభకు హాజరు కావాలని కోరారు. రానున్న ఎన్నికల్లో వైసీపీకి చరమగీతం పాడాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వేగుంట శ్రీనివాస్, ఎం.కనకరాజు, తదితరులు పాల్గొన్నారు. అలాగే 88వ వార్డు దువ్వాడలో కార్పొరేటర్ మొల్లి ముత్యాలనాయుడు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన శంఖారావం సభను విజయవంతం చేయాలని కోరారు.

పెదగంట్యాడ: లోకేశ్ శంఖారావం సభకు మండలం నుంచి అధిక సంఖ్యలో పాల్గొనవలసిందిగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి కోరారు. పార్టీ కార్యాలయంలో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ సభను విజయవంతం చేసి రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయానికి ఇదే సంకేతం అన్నట్టు చేయాలన్నారు. సమావేశంలో నాయకులు పులి వెంకటరమణారెడ్డి, గోక్యాడ ముత్యాలు, నమ్మి అప్పారావు, డి.పెరుమాళ్లు, ఎస్.శ్రీనివాసరావు, ఎం.పెంటయ్య, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పతనం తథ్యం

జనసేన పీఏసీ సభ్యుడు కోన తాతారావు

కూర్మన్నపాలెం, ఫిబ్రవరి 18: ప్రజల విశ్వాసం కోల్పోయిన వైసీపీ పతనం తథ్యమని జనసేన పీఏసీ సభ్యుడు కోన తాతారావు అన్నారు. 87వ వార్డు పరిధి వడ్లపూడి, కణితి, తిరుమలనగర్, సిద్దార్థనగర్, రాజులపాలెం, లక్ష్మీపురం, కూర్మన్నపాలెం, అప్పికొండ, కాశీపాలెంలలో ఆదివారం జనసేన పార్టీ ఆధ్వర్యంలో పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన-టీడీపీ పొత్తుతో వైసీపీ ఓటమి ఖాయమన్నారు. వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యమని, ఏటా జాబ్ క్యాలెండర్ అంటూ నిరుద్యోగులను మోసం చేసిందని, మహిళలకు రక్షణ కరువైందని, ప్రతిపక్ష నేతలపై అక్రమ కేసులు పెట్టడం, వ్యవస్థలను అడ్డం పెట్టుకుని కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం తప్ప చేసేందేమీ లేదని విమర్శించారు. వైసీపీ పాలనతో విసిగి వేసారిన జనం రానున్న ఎన్నికల్లో ఆ పార్టీని ఓడించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.

ఈ కార్యక్రమంలో నాయకులు సిరసపల్లి కనకరాజు, తోట ప్రియదర్శిని, కాద శ్రీను, జి.అప్పారావు, డి.గోవిందరెడ్డి, కె.కనకారావు, ఎల్.మురళీదేవి, జ్యోతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



పాదయాత్రలో పాల్గొన్న కోన తాతారావు, తదితరులు

అధ్వాన రహదారితో అవస్థలు

పెదగంట్యాడ జంక్షన్ నుంచి మహాత్మాగాంధీ కూడలి వరకు గోతులతో నిండిన రోడ్డు

తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న వాహనదారులు

నిర్మాణానికి మేయర్ శంకుస్థాపన చేసి రోజులు గడుస్తున్నా ప్రారంభం కాని పనులు

పెదగంట్యాడ, ఫిబ్రవరి 19: పెదగంట్యాడ జంక్షన్ నుంచి మహాత్మాగాంధీ కూడలి వరకు ఉన్న ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. రోడ్డు మొత్తం ఎక్కడికక్కడ గోతులతో నిండిపోవడంతో ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తున్న తీవ్ర ఇబ్బందులకు గురవతున్నారు. తారురోడ్డులోని పై లేయర్ లేచిపోయి కొన్నిచోట్ల గోతులు పడగా, మరికొన్నచోట్ల రోడ్డు అంచులు పూర్తిగా పోయాయి. రాళ్లు తేలిన రోడ్డులో రాకపోకలు సాగించడం ఇబ్బందికరంగా ఉంటుందని పలువురు వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గోతుల మూలంగా ఒక్కోసారి వాహనాలు స్కిడ్ అయి ప్రమాదాల బారిన పడుతున్నామని వాపోతున్నారు. పెదగంట్యాడ, గాజువాక ప్రాంతాల నుంచి స్టీల్‌ప్లాంట్, గంగవరం పోర్టు, గంగవరం, పల్లిపాలెం, వెంకన్నపాలెం ప్రాంతాలకు వెళ్లేవారు, ఈ ప్రాంతాల నుంచి పెదగంట్యాడ, గాజువాకకు రాకపోకలు సాగించేవారు అధ్వానంగా రోడ్డుతో నిత్యం అవస్థలు పడుతున్నారు. ఇదే రోడ్డుకు రూ.రెండు కోట్ల రూపాయలతో మరమ్మతులు చేపట్టేందుకు మేయర్ హరి వెంకటకుమారి శంకుస్థాపన చేసి రోజులు గడుస్తున్నా పనులు మాత్రం ప్రారంభం కావడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని అధికారులు తక్షణమే రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని వేడుకుంటున్నారు.



రాళ్లు తేలి ఉన్న రోడ్డు



రహదారి మధ్యలో ఉన్న గోతులు

నేచురోపతి వైద్య శిబిరానికి విశేష స్పందన

అక్కిరెడ్డిపాలెం, ఫిబ్రవరి 18: మింది హైస్కూల్ వద్ద కాస్మిక్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత ఆక్యుపంచర్, నేచురోపతి వైద్య శిబిరానికి మంచి స్పందన వచ్చిందది. ఈ వైద్య శిబిరాన్ని ప్రారంభించిన డాక్టర్ విశ్వశాంతి మాట్లాడుతూ అనేక దీర్ఘకాలిక వ్యాధులను ఆక్యుపంచర్, నేచురోపతి ద్వారా నయం చేయవచ్చన్నారు. ఈ శిబిరంలో సుమారు 80 మందికి వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో వైద్యులు కె.శ్రీధర్, అన్నపూర్ణ, శ్రావణి, హారికతో పాటు స్థానిక నాయకులు ఈటి శ్రీరాములు, ఎస్.గురునాథరావు, వి.వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సంక్షేమమే ఇంటక్ ధ్యేయం


ఉక్కు టౌన్‌షిప్, ఫిబ్రవరి 18: కార్మిక సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా ఇంటక్ జాతీయ అధ్యక్షుడు జి.సంజీవరెడ్డి నాయకత్వంలో తాము ముందుకు సాగుతున్నామని ఇంటక్ స్టీల్‌ప్లాంట్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ అన్నారు. సంజీవరెడ్డి జన్మదినాన్ని ఆదివారం నడుపూరులో ఇంటక్ కాంట్రాక్ట్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటక్ అంటే కార్మికుల పక్షపాతి అని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం, కార్మిక హక్కుల సాధనే ధ్యేయంగా పోరాటం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బీవీ నగేశ్, మంత్రి శంకర నారాయణ, గురుమూర్తి, అప్పలరాజు, గోపి నారాయణ, గంగవరం గోపి, తదితరులు పాల్గొన్నారు.

అక్కిరెడ్డిపాలెం: బెల్ హెచ్‌పీవీపీలో ఇంటక్ జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని బెల్ ఇంటక్ ప్రధాన కార్యదర్శి ఉరుకూటి బాబూరావు కేక్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బెల్ హెచ్‌పీవీపి అభివృద్ధికి, కార్మిక సంక్షేమానికి పూర్తి స్థాయిలో కృషి చేసిన ఘనత సంజీవరెడ్డికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు పీవీ అప్పారావు, వారాడ ఆనందరావు, సీహెచ్ మురళీశ్వరరావు, సీతంనాయుడు, కె.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన సముపార్జనకు పుస్తకాలు చదవాలి

పెదగంట్యాడ, ఫిబ్రవరి 18: విజ్ఞానాన్ని, వ్యక్తిత్వ వికాసాన్ని సముపార్జించేందుకు పుస్తకాలను చదవాలని పెదగంట్యాడ శాఖ గ్రంథాలయాధికారి పీవీ రమణ విద్యార్థులకు సూచించారు. చదవడం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా ఆదివారం గ్రంథాలయంలో ఆయన విద్యార్థులతో పలు పుస్తకాలు చదివించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు, ఇంగ్లిష్, హిందీ భాషల్లో వివిధ రకాల పుస్తకాలు ఉన్నాయని, వీటిని చదవడం వల్ల అన్ని అంశాల్లోనూ పరిజ్ఞానం పెరుగుతుందని, భాష పట్ల మంచి అవగాహన ఏర్పడుతుందన్నారు. అందువల్ల విద్యార్థులు తమ తరగతి పుస్తకాలతో పాటు ప్రముఖ రచయితల పుస్తకాలను చదవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నడుపూరు జెడ్పీ ఉన్నత పాఠశాల, నెల్లిముక్కు యూపీ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

రిపబ్లిక్ డే వేడుకల్లో పాల్గొన్న విద్యార్థినికి అభినందనలు



విద్యార్థిని జి.శరణ్యాను అభినందిస్తున్న దృశ్యం

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 18: ఢిల్లీలో రిపబ్లిక్ డే వేడుకల్లో పాల్గొని మంచి ప్రతిభ కనబరిచిన స్టీల్ ప్లాంట్ సృష్టి స్కూల్ విద్యార్థిని జి.శరణ్యాను పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విశాఖ గ్రూప్ అడ్మినిస్ట్రేట్ అధికారి కల్నల్ అమితాబ్‌కుమార్ అభినందించి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధించాలనే పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో గ్రూప్ ట్రైనింగ్ అధికారి రాజ్‌కుమార్, లెఫ్టినెంట్ కల్నల్ నీరజ్‌కుమార్, పాఠశాల డైరెక్టర్ సుశీలారాణి, చీఫ్ ప్రిన్సిపాల్ శ్రీధర్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.



అయోధ్య నమూనా రామాలయంతో ఏసీపీ త్రినాథ్, విద్యార్థులు, తదితరులు

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శనలు

ఆటోనగర్, ఫిబ్రవరి 18: చిన్నారులు నవ్య ఆలోచనలతో ముందుకు సాగితే మంచి శాస్త్రవేత్తలు అవుతారని సౌత్ ఏసీపీ టి.త్రినాథ్ అన్నారు. శ్రీనగర్‌లోని యాపిల్ ఐ స్కూల్‌లో ఆదివారం జరిగి సృజనోత్సవ్-2024 కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ సంస్కృతికి అద్దం పట్టేలా అయోధ్య రామ మందిరం, రామాయణ ఘట్టాల గురించి విద్యార్థులు ప్రదర్శించిన తీరు ప్రశంసనీయమన్నారు. టీఎస్సార్ టీటీకే కళాశాల చైర్మన్ తలశిల బల రామకృష్ణ మాట్లాడుతూ ఈ ఉత్సవాలను రెండు రోజుల పాటు నిర్వహిస్తామన్నారు. విద్యార్థులంతా శాస్త్ర, సాంకేతిక రంగాలలో మరింత పురోగతి సాధించాలన్నారు. విద్యార్థులు రూపొందించిన 101 ప్రాజెక్టుల నమూనాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కరస్పాండెంట్ తలశిల ఉమా మహేశ్వరరావు, ప్రిన్సిపాల్ పమీలా ముఖర్జీ, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై నారా లోకేశ్‌కు వినతి



లోకేశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న రౌతు శ్రీనివాస్, తదితరులు

అగనంపూడి, ఫిబ్రవరి 18: కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) కార్యాలయాన్ని ఫార్మాసిటీలో ఏర్పాటు చేయడంతో పాటు స్థానికంగా నెలకొన్న పలు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరుతూ టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేశ్‌కు 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ ఆధ్వర్యంలో పలువురు కలిసి వినతిపత్రం అందజేశారు. ఫార్మాసిటీ కాలుష్యం వల్ల పలు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. లోకేశ్‌ను కలిసిన వారిలో టీడీపీ నాయకులు పైలా జగన్నాథరావు, ఎం.నీలబాబు, అట్టా సన్యాసి అప్పారావు, తదితరులు ఉన్నారు.

నేడు దుర్గమాంబ ఆలయ వార్షికోత్సవం

అగనంపూడి, ఫిబ్రవరి 18: జీవీఎంసీ 85వ వార్డు పరిధి ఉక్కు నిర్వాసిత కాలనీ డొంకాడ ప్రజల ఆరాధ్య దైవం దుర్గమాంబ ఆలయ 21వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు మధ్యాహ్నం అన్న సమారాధన చేపట్టనున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. సాయంత్రం ఆలయ ఆవరణలో పరస పలు సాంస్కృతిక ప్రదర్శనలను ఏర్పాటు చేసినట్లు వారు పేర్కొన్నారు.

జాబ్ కేపిటల్‌గా విశాఖ

... 5వ పేజీ తరువాయి

ఇచ్చారు. ఓపెన్ డ్రెయిన్లు ఈ ప్రాంతంలో ప్రధాన సమస్యగా ఉన్నాయని, భూగర్భ డ్రెయిన్లుగా మార్చేలా చర్యలు తీసుకుంటామన్నారు.

టీడీపీకి బలమే కార్యకర్తలు

తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే బలమని లోకేశ్ అన్నారు. ఇక్కడ ఎమ్మెల్యే పార్టీ మారినా కార్యకర్తలు అండగా ఉన్నారన్నారు. కష్టపడి పనిచేసే కార్యకర్తలకు భవిష్యత్తులో ఉన్నత స్థానాలను కల్పిస్తానని లోకేశ్ హామీ ఇచ్చారు. రానున్న రెండు నెలలు కష్టపడి పార్టీని అధికారంలోకి తీసుకురావాలని, ఇంటింటికీ వెళ్లి 'సూపర్ సిక్స్' పథకాల గురించి వివరించాలన్నారు.

టీడీపీ, జనసేన కార్యకర్తల మధ్య చిచ్చు పెట్టేందుకు ఐదు రూపాయలు ఇస్తే పోస్టులు పెట్టే కొంతమంది యత్నిస్తున్నారని, వారి విషయంలో అప్రమత్తంగా ఉండాలని నారా లోకేశ్ సూచించారు. టీడీపీ, జనసేన కార్యకర్తల లక్ష్యం ఒక్కటేనని, 'హలో ఏపీ, బైబై వైసీపీ' అని లోకేశ్ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. నాయకులు, కార్యకర్తలపై అక్రమంగా కేసులు పెట్టి వేధించిన అధికారులు, వైసీపీ నాయకులపై అధికారంలోకి వచ్చిన తరువాత చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు. తాను రెడ్ బుక్ పట్టుకుని తిరుగుతుంటే వైసీపీ నాయకులకు భయం పట్టుకుందని, దీనిపై కోర్టుకు వెళుతున్నారని పేర్కొన్నారు. దమ్ము, ధైర్యం ఉంటే తనను అరెస్టు చేయాలని లోకేశ్ అన్నారు.

జీవీఎంసీలో అవినీతి

జీవీఎంసీలో పెద్దఎత్తున అవినీతికి పాల్పడుతున్నారని, ఒక్క రోడ్డు, డ్రైన్ వేయలేదని, పన్నులు మాత్రం వసూలు చేస్తున్నారని విమర్శించారు. పన్నులు కట్టకపోతే పెన్షన్లు కట్ చేస్తున్నారని, ఇటువంటి ప్రభుత్వాన్ని ఎక్కడైనా చూశారా? ...అని లోకేశ్ ప్రశ్నించారు. మత సామరస్యానికి దక్షిణ నియోజకవర్గం మారుపేరని, ఇక్కడ ఒకే కొండపై గుడి, చర్చి, మసీదు ఉంటాయని, విశాఖ సౌత్‌ను ఓల్డ్ సిటీగా పేర్కొంటారని, అటువంటి సిటీలోని ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని లోకేశ్ ఆవేదన వ్యక్తం చేవారు. ఈ ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక ఉందని, అధికారంలోకి వచ్చిన వెంటనే ఇక్కడున్న నిరుపేదలకు పక్కా ఇళ్లు కట్టించే బాధ్యతను తాను తీసుకుంటానని ఆయన స్పష్టం చేశారు.

తాము గతంలో ఒక పొరపాటు చేశామని, ఇక్కడి ప్రజలు వద్దన్నా రెండుసార్లు ఒక వ్యక్తికి ఎమ్మెల్యే టికెట్ ఇచ్చామని పరోక్షంగా వాసుపల్లి గురించి లోకేశ్ ప్రస్తావించారు. ఆయన వ్యక్తిగత స్వార్థం కోసం పార్టీ మారాడన్నారు. అటువంటి వ్యక్తులకు టీడీపీలోకి ఎంట్రీ లేదని, అటువంటి వ్యక్తికి టికెట్ ఇచ్చినందుకు తమను మన్నించాలని ఈ సందర్భంగా లోకేశ్ కోరారు. జైహింద్ అంటూ నీతీ, నిజాయితీలు కలిగిన వ్యక్తిలా ఇక్కడి ఎమ్మెల్యే మాట్లాడుతుంటాడని, వైసీపీలోకి వెళ్లిన తరువాత చిన్న దొంగగా మారాడని ఆరోపించారు. పేదలకు రావాల్సిన ఉద్యోగాలను డబ్బులకు అమ్ముకుంటున్నాడని విమర్శించారు. ఇప్పుడున్న ఎమ్మెల్యేను చిత్తుచిత్తుగా ఓడించాలని లోకేష్ ప్రజలకు పిలుపునిచ్చారు.

నేడు ఉత్తర, గాజువాక నియోజకవర్గాల్లో లోకేశ్ శంఖారావం

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ సోమవారం విశాఖ ఉత్తర, గాజువాక నియోజకవర్గాల్లో జరిగే శంఖారావం సభలలో పాల్గొంటారు. ఉదయం పది గంటలకు విశాఖ ఉత్తరంలోని బిర్లా జంక్షన్ దరి మైదానంలో శంఖారావం సభకు హాజరవుతారు. పార్టీ కేడర్‌తో సమావేశం, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు, జనసేన ఇన్‌చార్జి పసుపులేటి ఉషాకిరణ్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎం.శ్రీభరత్‌లు ప్రసంగిస్తారు. అనంతరం లోకేశ్ మాట్లాడతారు. ఆ తరువాత పాత గాజువాక లంకా మైదానంలో శంఖారావం సభకు లోకేశ్ హాజరవుతారు. మధ్యాహ్నం రెండు నుంచి మూడు గంటల వరకు సభ నిర్వహిస్తారు. అనంతరం ఆయన అనకాపల్లి జిల్లాలోని అనకాపల్లి, చోడవరం సభల్లో పాల్గొంటారు.

ఐరన్ లెగ్ జగన్

... 5వ పేజీ తరువాయి

మంచిదన్నారు. గతంలో ఎన్నడూ చూడనన్ని ప్రమాదాలను విశాఖ నాలుగున్నరేళ్లలో చూసిందన్నారు. గతంలో చంద్రబాబు నాయుడు విశాఖ వైపు ప్రపంచం చూసేలా అభివృద్ధి చేశారని, జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత నాశనం చేశాడన్నారు. జగన్ అక్రమంగా కట్టిన భవనాలను జప్తు చేసి అమ్మి ప్రజలకు పంచి పెడతామని లోకేశ్ అన్నారు. ఎన్నికల సమయం దగ్గరపడుతున్న తరుణంలో వైసీపీ నాయకులు ఓటుకు పది వేలు ఇస్తామంటారని, అడ్డంగా దోచుకున్న వైసీపీ నాయకులు నుంచి డబ్బులు తీసుకుని టీడీపీ, జనసేన అభ్యర్థులకు ఓటేయలని లోకేశ్ సూచించారు. టీడీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే విద్యార్థుల మెస్ చార్జీలు పెంచుతామని, వసతి గృహాలను ఆధునికీకరిస్తామన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టేందుకు జగన్ సిద్ధపడుతున్నాడని, దీనికి కారణం ప్రైవేటు వ్యక్తులతో కుమ్మక్కు కావడమే నిదర్శనమన్నారు.

ఏయూ వీసీ ప్రసాదరెడ్డి అక్రమాలపై విచారణ

ఏయూ వీసీ ప్రసాదరెడ్డి చేసిన అక్రమాలపై విచారణ జరిపించి డిస్మిస్ చేసి జైలులో పెట్టిస్తామని లోకేశ్ అన్నారు. ప్రసాదరెడ్డి అక్రమాలన్నీ రెడ్‌బుక్‌లో ఉన్నాయన్నారు. టీడీఆర్ బాండ్లలో ఎంపీ విజయసాయిరెడ్డి భారీఎత్తున అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. పెదజాలరిపేట, బిలాల్ కాలనీ, మధురవాడల్లో టీడీఆర్ బాండ్ల పేరుతో వైకాపా నాయకులు రూ.వేల కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. దసపల్లా భూములు కొట్టేశారని ఆరోపిస్తూ..వీటన్నింటిపై ప్రభుత్వం వచ్చిన తరువాత విచారణ జరిపి వడ్డీతో సహా కక్కిస్తామని పేర్కొన్నారు. ఎల్‌జీ పాలిమర్స్ స్థానంలో కాలుష్యం లేని పరిశ్రమలు తీసుకువచ్చి స్థానికులకు ఉపాధి కల్పిస్తామని లోకేశ్ ప్రకటించారు. జింక్ పరిశ్రమ ప్రాంతంలో కూడా కొత్త పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. తమ హయాంలో ఎన్‌ఏడీ ఫ్లై ఓవర్, గోపాలపట్నంలో బీటీ, సీసీ రహదారులతోపాటు ఇండోర్ స్టేడియం నిర్మించామని లోకేశ్ వివరించారు.

మ్యూజియం మరమ్మతుల్లో మహా మాయ

... 5వ పేజీ తరువాయి

పెద్దలు సరిగ్గా దీనినే తమకు అవకాశంగా మార్చుకున్నారు. మిలాన్ నేపథ్యంలో బీచ్‌రోడ్డులోని విశాఖ మ్యూజియం గోడలకు పుట్టీలు, రంగులు వేయడంతోపాటు పీఓపీ సీలింగ్ పనులు, నడకదారులకు రంగులు, ఇత్తడి నేమ్ బోర్డు ఏర్పాటు, మరుగుదొడ్ల మరమ్మతులు పేరుతో సుమారు రూ.1.4 కోట్ల విలువైన పనులను ప్రతిపాదించారు. అన్ని పనులను కలిపి ఒకే టెండరు పిలవడమో లేదంటే పెయింటింగ్‌లు, సివిల్ వర్కులను నాలుగైదు పనులుగా విభజించి టెండర్లు పిలవడమో చేయాలి. కానీ అలా చేస్తే రూ.ఐదు లక్షల కంటే ఎక్కువ అయిపోతుంది కాబట్టి, టెండరు పిలవాల్సి వస్తుందని అధికారులు భావించారు. అలాకాకుండా రూ.ఐదు లక్షలలోపు ఉండేలా ఒక్కో పనిని ముక్కలుగా విడగొట్టారు. ఆయా పనులను తమకు అస్మదీయులైన కాంట్రాక్టర్లకు అప్పగించేశారు. వాస్తవానికి స్టాండింగ్ కమిటీలో ఆమోదం పొందిన తర్వాతే పనులను కాంట్రాక్టర్‌కు అప్పగించాలి. కానీ మ్యూజియం పనుల విషయంలో అలా జరగకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ముందుగా పనులు ప్రారంభించేసి, తర్వాత ఈ నెల ఏడున జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో కొన్ని అంశాలను ఆమోదించారు. ఈనెల 20న జరిగే స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఆమోదానికి మరికొన్ని అంశాలను ప్రతిపాదించారు. పనులకు పరిపాలనా ఆమోదం లభించకుండానే సోమవారం మ్యూజియాన్ని పునఃప్రారంభిస్తున్నట్టు జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ ప్రకటించారు. పనులు పూర్తిచేసిన తర్వాత స్టాండింగ్ కమిటీ ఆమోదానికి ప్రతిపాదించారా?, లేకపోతే పనులు పూర్తవకుండానే మ్యూజియాన్ని పునఃప్రారంభిచేస్తున్నారా?...అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. టెండర్ల ద్వారా పనులు కేటాయించినట్టయితే కాంట్రాక్టర్ల మధ్య పోటీ పెరిగి తక్కువకు కోట్ చేస్తారని, దీనివల్ల జీవీఎంసీకి చాలావరకూ డబ్బులు మిగులుతాయని కాంట్రాక్టర్లు పేర్కొంటున్నారు. కానీ పాలకవర్గంలోని పెద్దల ఒత్తిడి వల్లనో...అధికారుల ప్రత్యేక ఆసక్తితోనో అస్మదీయులైన కాంట్రాక్టర్లతో పనులు చేయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్ని పనులను అధికారులే బినామీల పేరుతో చేస్తున్నారని కాంట్రాక్టర్లు ఆరోపిస్తున్నారు. గతంలో జీ-20 సదస్సు సందర్భంగా అధికారులు ఇదే మాదిరిగా వ్యవహరించారని, టెండర్లు తెరవకుండానే బినామీల పేరుతో కొన్ని పనులను చేయించేసి, ఆ పనులకు ఇతరులెవరూ బిడ్ వేయకుండా అడ్డుకున్నారని గుర్తుచేస్తున్నారు. మ్యూజియం మరమ్మతుల విషయంలో భారీగా అక్రమాలు జరిగాయని, దీనిపై విజిలెన్స్, ఏసీబీ అధికారులు దృష్టిసారిస్తే వాస్తవాలు బయటపడతాయని పేర్కొంటున్నారు.

అభయాంజనేయస్వామికి సింధూర పూజలు

కూర్మన్నపాలెం, ఫిబ్రవరి 18: జీవీఎంసీ 86వ వార్డు శాతవాహననగర్‌లో అభయాంజనేయస్వామికి మాఘమాస ఆదివారం సందర్భంగా ప్రధాన అర్చకులు శ్రీధర్‌స్వామి, నండూరు కృష్ణమాచార్యుల ఆధ్వర్యంలో సింధూర పూజలు, తమలపాకుల పూజ చేసి గారెలు, బూరెలతో సుందరంగా అలంకరించారు. కాట్రగడ్డ దుర్గాప్రసాద్, జ్యోతి దంపతుల ఆర్థిక సహాయంతో ఏర్పాటు చేసిన వెండి ఆభరణాలతో స్వామివారిని అలంకరించగా, పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. పలువురు మహిళలు సుందరకాండ పారాయణం, హనుమాన్ చాలీసా పఠించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ప్రసాద వితరణ చేపట్టారు.


నవశకం
శంఖారావం
కదలిరండి.. తెలుగుదేశం కార్యకర్తలారా
19 ఫిబ్రవరి, 2024
గాజువాక లంకా గ్రౌండ్ ఉ॥ 11.30 గం.కు
గంధం శ్రీనివాసరావు
76వ వార్డు టిడిపి కార్పొరేటర్
డిప్యూటీ ఫ్లోర్ లీడర్
బొండా జగన్
87వ వార్డు కార్పొరేటర్
పల్లా శ్రీనివాసరావు
67వ వార్డు కార్పొరేటర్
శ్రీమతి పులి లక్ష్మీబాయి
75వ వార్డు టిడిపి కార్పొరేటర్
నల్లూరు సూర్యనారాయణ
గ్రేటర్ విశాఖ 86వ వార్డు
తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి, గాజువాక
రౌతుల శ్రీనివాసరావు
79వ వార్డు టిడిపి కార్పొరేటర్
మొల్లి ముత్యాలనాయుడు
88వ వార్డు టిడిపి కార్పొరేటర్
ప్రసాదుల శ్రీనివాసరావు
గాజువాక సమన్వయకర్త
పల్లా శ్రీనివాసరావు, M.Tech, MBA
మాజీ శాసనసభ్యులు, గాజువాక
విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు